జర్నలిస్ట్ ఫైల్

INK OF TRUTH

సోమవారం 02.11.2026

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 192 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



ఎన్నికల ప్రక్రియను బహిష్కరించడం చేసి, ప్రజల్లో భయాందోళనలు సృష్టించి రీపోలింగ్ కోరాలన్నదే జగన్ కుట్ర. ఓటమి భయంతోనే ఇలా వ్యవహరిస్తున్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటేస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రజా ప్రతినిధిగా ఉండి ఓటు హక్కు వినియోగించుకోకుండా ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారు?

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బాలికకు నేనున్నా

బాధిత చిన్నారికి మంత్రి లోకేష్ అండ

సొంత బిడ్డలా ఆదుకుంటామని హామీ

వచ్చే 48 గంటలు అత్యంత కీలకం

విద్యార్థుల భద్రతకు పటిష్ఠ చర్యలు

బెంగళూరు (జర్నలిస్ట్ ఫైల్) : అనంతపురం జిల్లా రాప్తాడులో ఉన్మాది దాడి ఘటనలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికను సొంత కూతురిలా భావించి అండగా ఉంటానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం బెంగళూరు ఓల్డ్ హోల్ ఎయిర్ పోర్ట్ రోడ్డులోని మణిపాల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి లోకేష్.. అమానుష దాడి ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. బాలిక ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు..

రాప్తాడులో ఉన్మాది ఘటనలో గాయపడిన బాలికకు అనంతపురంలో చికిత్స చేసిన అనంతరం గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఇక్కడి వైద్యులు సుమారు 12 గంటలపాటు శ్రమించి బాలికకు అనేక శస్త్రచికిత్సలు చేశారు. అనంతరం ఐసీయూకి తరలించారు.

వచ్చే 48 గంటలు చాలా కీలకం : బాలిక ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. వచ్చే 48 గంటలు చాలా కీలకం. రాష్ట్ర ప్రజలందరూ బాలిక ఆరోగ్యం గురించి ప్రార్థించాలి. బాలిక చాలా స్ట్రాంగ్ గా ఉంది. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకుంటుంది. అన్ని విధాలా అండగా నిలబడుతుంది. జరిగిన ఘటనతో పాఠశాలలో విద్యార్థులు భయాందోళనలో ఉన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ అందిస్తున్నాం. ఇది ఒక్కరోజులో జరిగేది కాదు. వచ్చే ఏడాది పాటు మానిటరింగ్ చేస్తాం.

విద్యార్థుల రక్షణే మా మొదటి ప్రాధాన్యత : పాఠశాలలో మొదటి పీరియడ్ ప్రారంభమైన వెంటనే గేట్లు మూసివేస్తాం. సదరు పాఠశాలలో భవిత సెంటర్ నిర్మాణం జరుగుతుండటంతో కార్మికుడి ముసుగులో వచ్చి సదరు యువకుడు దారుణానికి పాల్పడ్డాడు. దాడి ఘటనను చాలా సీరియస్ గా తీసుకుంటున్నాం. మరోసారి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపడతాం. విద్యార్థుల రక్షణే మా మొదటి ప్రాధాన్యత. పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటుచేస్తాం. దాడికి పాల్పడిన వ్యక్తిపై న్యాయబద్ధంగా, కఠినమైన చర్యలు ఏపీ ప్రభుత్వం తీసుకుంటుంది. మహిళలపై దాడులకు పాల్పడే వారికి అదే చివరి రోజు అవుతుందని గతంలోనే హెచ్చరించడం జరిగింది. అలాంటి కఠినమైన, న్యాయబద్ధమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుంది. ఎవరినీ ఉపేక్షించేది లేదు.

బాలిక సురక్షితంగా ఇంటికి రావాలని ప్రార్థిద్దాం : బాలిక కుటుంబ సభ్యులను

మిగతా 2లో...

ప్రజాస్వామ్యంపై జగన్ నీతులా!

గతంలో పులివెందులలో అన్ని వార్డులూ ఏకగ్రీవం చేశారని విమర్శ

ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని వ్యాఖ్య

బెంగళూరులో మీడియాతో మంత్రి లోకేష్

2లో

తెలుగు పోలీసులకు దక్షత పతకాలు



- ఏపీ పోలీసు అధికారులకు కేంద్రం గుర్తింపు
- ఐపీఎస్‌లు, సిబ్బందికి పురస్కారాలు
- దేశవ్యాప్తంగా 490 మందికి పతకాలు ప్రకటన

2లో

హెలికాప్టర్‌కు పర్మిషన్ ఇచ్చాం



- జగన్ ఆరోపణలపై కడప కలెక్టర్ వివరణ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన ఆరోపణలపై కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ స్పందించారు. మిగతా 2లో...

రాప్తాడు కేసులో కీలక మలుపు

- విద్యార్థినిపై దాడి నిందితుడిపై పోలీసుల కాల్పులు
- ఆత్మకూరు అటవీ ప్రాంతంలో ఘటన
- హేమంత్‌కు తీవ్ర గాయాలు.. అనంతపురం ఆసుపత్రికి తరలింపు

3లో

ముంచుకొస్తున్న తుపాను ముప్పు

- నవంబర్ 3న బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం
- కోస్తాకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన
- సహాయక చర్యలకు యంత్రాంగం సిద్ధం కావాలని సీఎం ఆదేశం

2లో



ముంచుకొస్తున్న ముప్పు.. వైద్యశాఖ సంసిద్ధం

- 1,688 వైద్య బృందాలు.. 116 సహాయ శిబిరాలు
- 13,165 అత్యవసర పడకలు.. 733 అంబులెన్సులు సిద్ధం
- గర్భిణుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు

2లో

మరో 24 కరువు మండలాలు

- ఎనిమిది జిల్లాల్లో కొత్తగా కరువు ప్రకటన
- 12 తీవ్రం.. మరో 12 మధ్యస్త కరువు
- రాష్ట్రంలో మొత్తం 412కు చేరిన కరువు మండలాలు


2లో



పోలింగ్ ప్రశాంతం.. ఫిర్యాదులపై తక్షణ చర్యలు

- ఫిర్యాదులపై తక్షణ స్పందనకు ఎన్నికల సంఘం ఆదేశాలు
- 12 జిల్లాల కలెక్టర్లతో కమిషనర్ సమీక్ష
- ఆధారాలుంటే ఎఫ్ఐఆర్‌లు.. నిందితుల అరెస్టులు
- విజయవాడ 55వ వార్డులో 2.30 గంటలు పాడిగించిన పోలింగ్

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో ఆదివారం జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మెజారిటీ ప్రాంతాల్లో ప్రశాంతంగా జరిగిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున, ఐజీ రాజకుమారి లతో కలిసి ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, డీఐజీలు, ఎన్నికల పరిశీలకులతో ఇప్పటికే సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫిర్యాదులు, వినతులు అందాయని తెలిపారు. ఆయా ఫిర్యాదులపై ఎప్పట కప్పుడు పోలీస్ శాఖ, జిల్లా కలెక్టర్లు, మిగతా 2లో...



ముగిసిన ఓటు సమరం

- 92 పట్టణ స్థానిక సంస్థల్లో పూర్తయిన పోలింగ్
- విజయవాడ 55వ డివిజన్‌కు అదనపు సమయం
- బ్యాలెట్ బాక్సుల భద్రతకు ఏర్పాట్లు
- నవంబర్ 3న వెలువడనున్న ఫలితాలు

మిగతా 2లో...

రీపోలింగ్ అయితేనే ఓటేస్తా

- ఓటు వేయకుండానే బెంగళూరుకు జగన్ పయనం
- 70 మంది ఏజెంట్లను బయటకు పంపారంటూ ఆరోపణ
- పులివెందుల పోలింగ్‌పై ఆర్వోకు ఫిర్యాదు



పులివెందుల(జర్నలిస్ట్ ఫైల్) : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పులివెందులలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. బెంగళూరు నుంచి తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటు వేయకుండానే తిరిగి బెంగళూరుకు పయనమయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటు వేయబోనని, పులివెందులలో రీపోలింగ్ నిర్వహిస్తేనే తిరిగి వచ్చి ఓటు వేస్తానని ఆయన ప్రకటించారు.

పులివెందుల మున్సిపాలిటీలో పోలింగ్ నిర్వహణపై జగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ పార్టీకి చెందిన 70 మంది పోలింగ్ ఏజెంట్లను వివిధ పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపించారని ఆయన ఆరోపించారు. మొత్తం 80 పోలింగ్ కేంద్రాల్లో 70 కేంద్రాల్లో తమ ఏజెంట్లను అనుమతించలేదని పేర్కొన్నారు. ఈ అంశంపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా ధ్రువీకరణ అందుబాటులో లేదని వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

అనంతరం జగన్ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి, పార్టీ ఏజెంట్లతో కలిసి అక్కడ నిరసనకు దిగారు. పోలింగ్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి, మిగతా 3లో...

ఎన్నికలపై నిఘా



- 20 జిల్లాల్లో 41 ఘటనలు..
- వాస్తవ పరిస్థితులపై విచారణ
- నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు: డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించినట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. ఎన్నికల సందర్భంగా భారీగా పోలీసు బలగాలను మోహరించి, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మిగతా 3లో...

వందేభారత్ స్లీపర్ వచ్చేస్తోంది



3లో

- బెంగళూరు నుంచి ముంబైకి కొత్త రైలు
- ఏపీలో రెండు స్టేషన్లకు హాల్ట్
- ఎనిమిది నిలుపుదల కేంద్రాల ఖరారు

బెంగళూరు (జర్నలిస్ట్ ఫైల్) : దేశవ్యాప్తంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవల విస్తరణ వేగంగా కొనసాగుతోంది. ప్రయాణికుల నుంచి వస్తున్న ఆదరణకు అనుగుణంగా సెమీ హైస్పీడ్ రైళ్ల సంఖ్యను రైల్వే శాఖ క్రమంగా పెంచుతోంది. సాధారణ రైళ్లతో పోలిస్తే వేగవంతమైన ప్రయాణం, ఆధునిక సౌకర్యాలు ఉండటంతో వందే భారత్ రైళ్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వందే భారత్ స్లీపర్ రైళ్ల సేవలను కూడా విస్తరిస్తున్నారు.

తాజాగా బెంగళూరులోని సర్ ఎం. విశ్వేశ్వరయ్య టెర్మినల్ నుంచి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ మధ్య కొత్త వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రారంభించారు. ఈ రైలు బెంగళూరు--ముంబై మధ్య ఏపీ మీదుగా రాకపోకలు సాగించనుంది.

రైళ్ల రాకపోకల సమయాలు : బెంగళూరు-ముంబై (ట్రైన్ నంబర్ 27652):సోమవారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో సాయంత్రం 7.45 గంటలకు బెంగళూరులో బయలుదేరుతుంది.

బాలికకు నేనున్నా



(మొదటి పేజీ తరువాయి)

కూడా కలిశాను. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చాను. ఏ అవసరం వచ్చినా సంప్రదించాలని చెప్పాను. ప్రభుత్వ పరంగానే కాకుండా, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నేను, స్థానిక శాసనసభ్యురాలిగా పరిటాల సునీత గారు అండగా ఉంటామని ధైర్యం చెప్పాను. బాలిక ఆరోగ్య పరిస్థితిపై వచ్చే 48 గంటలు మేం నిరంతరం పర్యవేక్షిస్తాం. ఇక్కడి వైద్యులు అద్భుతంగా స్పందించారు. వైద్యులతో పాటు పోలీసులను కూడా అభినందిస్తున్నాను. గ్రీన్ ఛానల్ ఇవ్వాలని కోరిన వెంటనే తక్షణమే స్పందించి తగిన ఏర్పాట్లు చేశారు. బాలికను సురక్షితంగా తరలించారు. ఇలాంటి ట్రామా కేసును ఇక్కడి వైద్యులు ఎప్పుడూ చూడలేదు. 12 గంటల పాటు నిరంతరం శ్రమించారు. వచ్చే 48 గంటలు చాలా కీలకం. బాలిక సురక్షితంగా ఇంటికి రావాలని అందరం ప్రార్థిద్దామని మంత్రి లోకేష్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

అంతకుముందు బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి లోకేష్.. బాలికకు అందుతున్న చికిత్సపై ఆసుపత్రి వైద్యులతో సుదీర్ఘంగా చర్చించారు. విద్యార్థినికి అవసరమైన శస్త్రచికిత్సలను ఇప్పటికే విజయవంతంగా పూర్తిచేశామని, బాలిక ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. బాలిక ఆరోగ్య పరిస్థితికి వచ్చే 48 గంటలు చాలా కీలకమని వివరించారు. బాలిక ప్రాణాలు కాపాడేందుకు మణిపాల్ ఆసుపత్రి వైద్యులు చేస్తున్న కృషికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ కు వెళ్లి బాలికను చూశారు. బాలిక తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి, మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు.

ముగిసిన ఓటు సమరం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో 92 పట్టణ స్థానిక సంస్థలకు నిర్వహించిన ఎన్నికల పోలింగ్ ముగిసిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 11 కార్పొరేషన్లు, 73 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీల్లో పోలింగ్ పూర్తయిందని వెల్లడించారు.

సాయంత్రం 5 గంటల సమయానికి పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించినట్లు పునేఠా తెలిపారు. అయితే విజయవాడ 55వ డివిజన్‌లో పోలింగ్ సమయాన్ని రాత్రి 7.30 గంటల వరకు పొడిగించినట్లు చెప్పారు.

విజయవాడ 55వ డివిజన్‌లో బ్యాలెట్ పేపర్‌పై గుర్తులు తారుమారుగా ముద్రించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైందని ఎన్నికల కమిషనర్ వివరించారు. ఈ కారణంగా ఓటర్లకు అదనపు సమయం కేటాయించినట్లు తెలిపారు.

మిగతా ప్రాంతాల్లో పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో బ్యాలెట్ బాక్సులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పునేఠా చెప్పారు. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని, పోలింగ్ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించినట్లు వెల్లడించారు.

కాగా, నవంబర్ 1న నిర్వహించిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన నవంబర్ 3న జరుగుతాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు.

ముంచుకొస్తున్న ముప్పు.. వైద్యశాఖ సంసిద్ధం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : మురసు తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అవసరమైన ఏర్పాట్లు చేసింది. తుపాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న జిల్లాల్లో 1,688 వైద్య బృందాలు, 116 సహాయ శిబిరాలను సిద్ధం చేసింది. మొత్తం 13,165 అత్యవసర పడకలు, అవసరమైన మందులు, 43,672 పాముకాటు నివారణ ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచింది. 733 అత్యవసర అంబులెన్సులు (108), 300 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు (102), 721 సంచార వైద్య వాహనాలను (104) సిద్ధం చేసింది. ప్రసవ గడువు దగ్గరపడిన గర్భిణులను సమీప ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

అన్ని వైద్యశాలల్లో అత్యవసర వైద్య సేవలకు అవసరమైన మందులను సిద్ధం చేశారు. తీర ప్రాంతాల్లోని 121 ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా 1,833 వైద్యశాలల్లో జనరేటర్లు, ప్రత్యామ్నాయ విద్యుత్తు సదుపాయాలను సిద్ధం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో అంటువ్యాధుల నిఘా కేంద్రాలను ఏర్పాటు చేసి 24 గంటల పాటు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

గర్భిణుల భద్రతకు ప్రత్యేక చర్యలు : నవంబర్ 1 నుంచి 10వ తేదీ మధ్య ప్రసవ గడువు ఉన్న 6,870 మంది గర్భిణులను గుర్తించారు. వీరిలో 493 మందిని ఇప్పటికే సమీప వైద్యశాలలకు తరలించారు. మిగిలిన వారిని అవసరాన్ని బట్టి ముందుగానే తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వారి నివాస ప్రాంతాలను బట్టి సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో ప్రసవానికి సదుపాయాలు కల్పించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో కలుషిత నీరు, దోమలు, ఆహారం ద్వారా వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. వైద్యశాలలు, సహాయ శిబిరాల వద్ద పారిశుద్ధ్య పనులకు ఏర్పాట్లు చేశారు. నీటిని శుభ్రపరిచేందుకు క్లోరిన్ మాత్రలను అందుబాటులో ఉంచారు. సురక్షిత తాగునీరు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పురపాలక శాఖలతో సమన్వయం చేసుకుంటున్నారు.

టీడీపీ అభ్యర్థికి ఫ్యాన్ గుర్తు, వైసీపీ అభ్యర్థికి సైకిల్ గుర్తు.. గందరగోళం..!

తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్) : తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్ ఎన్నికల వేళ గందరగోళం నెలకొంది. పట్టణంలోని 35వ వార్డు పరిధిలోని పోలింగ్ బూత్‌లో అభ్యర్థుల గుర్తులు తారుమారు కావడం తీవ్ర కలకలం రేపింది. టీడీపీ అభ్యర్థికి కేటాయించాల్సిన 'సైకిల్' గుర్తు వైఎస్సార్సీపీ అభ్యర్థి పేరు ముందు ముద్రించబడింది. అలాగే వైఎస్సార్సీపీకి చెందాల్సిన 'ఫ్యాన్' గుర్తును టీడీపీ అభ్యర్థికి కేటాయించినట్లు తేలింది. దీంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ పోలింగ్ కేంద్రం వద్ద నిరసనకు దిగారు. ముద్రణ లోపాన్ని వెంటనే సరిదిద్ది, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో వార్డులో ఓటింగ్ ప్రారంభం కాకుండానే నిలిచిపోయింది.

గుర్తుల తారుమారుపై... : సంఘటనా స్థలానికి చేరుకున్న ఎన్నికల అధికారులు, స్థానిక యంత్రాంగం ప్రస్తుతం అక్కడ ఉన్న పరిస్థితిని నిశితంగా సమీక్షిస్తున్నారు. గుర్తుల తారుమారుపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు సమాచారం. ఈ వార్డులో పోలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసి కొత్త బ్యాలెట్ పేపర్లతో మళ్లీ నిర్వహించాలా లేక ఎన్నికలను వాయిదా వేయాలా అనే అంశంపై అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ముంచుకొస్తున్న తుపాను ముప్పు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రానికి మరో తుఫాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రాష్ట్రంపై తుఫాను ప్రభావం, వర్షాలు, గాలుల తీవ్రత, జలాశయాల నిర్వహణ అంశాలతో పాటు వివిధ శాఖలు చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణపై సమీక్షించారు. తుఫాను సహాయక చర్యలపై అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుఫాను ముప్పు నెలకొనడంతో సోమవారం నాటి తన ఢిల్లీ పర్యటనను కూడా రద్దు చేసుకున్నట్టు సీఎం తెలిపారు.

నవంబర్ 3న తీరం దాటే అవకాశం : ప్రస్తుత వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా, అనంతరం తుఫానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నవంబర్ 2 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని, నవంబర్ 3వ తేదీ ఉదయం బాపట్ల సమీపంలో తీవ్ర తుఫానుగా తీరం దాటొచ్చని తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 100-110 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. తుఫాన్ కారణంగా నవంబర్ 2న దక్షిణ, మధ్య కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, అక్కడక్కడ అతి భారీ వర్షాలు... అలాగే, నవంబర్ 3, 4 తేదీల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అత్యంత భారీ వర్షాల అంచనా ఉన్న 20 మండలాల్లో ఏలూరు జిల్లాలో 9, కృష్ణా జిల్లాలో 5, ఎన్టీఆర్ జిల్లాలో 5, బాపట్ల జిల్లాలో ఒకటి ఉన్నాయన్నారు. నవంబర్ 3న జిల్లాల వారీగా అంచనా వేసిన సగటు వర్షపాతం వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఏలూరు జిల్లాలో సుమారు 179 మిల్లీమీటర్లు, కృష్ణా జిల్లాలో 163 మి.మీ., ఎన్టీఆర్ జిల్లాలో 161 మి.మీ., పశ్చిమ గోదావరి జిల్లాలో 147 మి.మీ., గుంటూరు జిల్లాలో 119 మి.మీ., బాపట్ల జిల్లాలో 104 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

బుడమేరు సహా పలు చోట్ల వరద ముప్పు : భారీ వర్షాల నేపథ్యంలో బుడమేరు దగ్గర నవంబర్ 3న సుమారు 32,500 క్యూసెక్కుల ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఎర్రకాల్వ, గోనెలవాగు, జల్లేరు, పంపా తదితర జలాశయాల్లో కూడా భారీ వరద వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను ప్రభావంతో బలమైన గాలులు వీచడం వల్ల 12 జిల్లాల్లో సుమారు 12,102 నుంచి 15,128 విద్యుత్ స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు అవసరమైన మానవ వనరులు, పరికరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి అవసరమైన సిబ్బందిని, సామగ్రిని ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు తరలించి అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ స్తంభాలు పడిపోయిన సందర్భాల్లో ఎన్ని గంటల్లో పునరుద్ధరణ చేపట్టగలుగుతాం, ఎప్పటిలోగా విద్యుత్ సరఫరా అందించగలుగుతామనే విషయంపై స్పష్టమైన కార్యాచరణ ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమాచారాన్ని ప్రజలకు కూడా తెలియజేసే పరిస్థితి ఉండాలని సూచించారు.

ప్రతి 4 గంటలకు తుఫాను పరిస్థితిపై బులెటిన్ : తుఫాను ప్రభావంపై ప్రతి నాలుగు గంటలకు ఒకసారి బులెటిన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. టెలికాం నెట్‌వర్క్ సంస్థలు ముందస్తు చర్యలు తీసుకుని మొబైల్ సిగ్నల్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సంస్థలను ముందుగానే అప్రమత్తం చేసి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అర్నబ్ తుఫాను సమయంలో నెట్‌వర్క్ సంస్థలు మరింత ముందస్తు జాగ్రత్త



చర్యలు తీసుకుని ఉంటే బాగుండేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో అర్నబ్ తుఫాను వల్ల జరిగిన నష్టం, సహాయక చర్యల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణపై ముఖ్యమంత్రి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు రాత్రికి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

ప్రజాస్వామ్యంపై జగన్ నీతులా!

బెంగళూరు (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజాప్రభుత్వ పాలనలో పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించిన అనంతరం స్థానిక ఎన్నికలపై మంత్రి స్పందించారు. పులివెందులలో ఏకగ్రీవం జరిగాయని వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పులివెందులలోని ప్రతివార్డు ఏకగ్రీవం చేశారు. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి నీతులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో పులివెందులలో ఏవిధంగా ఏకగ్రీవం చేశారని అందరూ ప్రశ్నించాలి. ఇవాళ ప్రజాప్రభుత్వ పాలనలో పారదర్శకంగా స్థానిక ఎన్నికలను నిర్వహించడం జరుగుతోంది. ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు పోలీస్ సెక్యూరిటీని కల్పించడం జరిగింది. పులివెందులలో నామినేషన్ వేసేందుకు ఎవరూ అడ్డుపడలేదు. నామినేషన్ వేశారు. పులివెందులలో శాంతిభద్రతల సమస్యను సృష్టించారు. గత రాత్రి వాహనాలను తగులబెట్టారు. నిందను మాపై వేశారు. ప్రజలపై వారే దాడి చేసి మాపై దుష్ప్రచారం చేస్తున్నారు.



ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల మాకు విశ్వాసం ఉంది : ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల మాకు విశ్వాసం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వం-కు ఎన్నికలు జరుగుతున్నాయి. పులివెందులలోనే ఎందుకు సమస్యలు వస్తున్నాయి? ఇందుకు జగన్మోహన్ రెడ్డి వైఖరే కారణం. పులివెందులలో జగన్ రెడ్డి శాంతిభద్రతల సమస్యను సృష్టించారు. ఇప్పుడు తామే బాధితులం అని చెప్పుకుంటున్నారు. ఎన్నికలు జరుగుతున్నాయని తెలుసు. జగన్ రెడ్డి మాత్రం బెంగళూరులో ఉంటారు. ఆదివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి వచ్చి సమస్యలు సృష్టించారు. అనంతరం హెలికాప్టర్ లో బెంగళూరు వెళ్లిపోయారు. జాతీయ మీడియాను పిలిచి శాంతిభద్రతల సమస్య అంటూ నిందలు వేస్తున్నారు.

జగన్ రెడ్డి తీరువల్లే పులివెందులలో శాంతిభద్రతల సమస్య : గత ఎన్నికల్లో పులివెందుల ఎందుకు ఏకగ్రీవం అయిందో ప్రజలకు జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. గత ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి పాతర వేశారు. ఇప్పుడు మేం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నాం. పులివెందులలో కూడా ప్రజలు వచ్చి ఓట్లు వేశారు. జగన్ రెడ్డి వచ్చి సమస్యలు సృష్టిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉండగా ర్యాలీ ఏవిధంగా నిర్వహిస్తారు? విశాఖతో సహా కడప పట్టణంలో ఎన్నికలు జరిగాయి. ఒక్క సమస్య కూడా ఉత్పన్నం కాలేదు. సమస్యలకు జగన్ రెడ్డి ఒక్కడే కారణమని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ చెప్పారు.

పోలింగ్ ప్రశాంతం..ఫిర్యాదులపై తక్షణ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఎస్పీలు, కమిషనర్లతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

12 జిల్లాల కలెక్టర్లతో సమీక్ష : పోలింగ్ సరళి, ఫిర్యాదులు, హింసాత్మక ఘటనలపై నంద్యాల, కడప, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లతో సుమారు 45 నిమిషాల పాటు మాట్లాడినట్లు కమిషనర్ తెలిపారు.



మెజారిటీ జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్నట్లు కలెక్టర్లు నివేదించారని, కొన్ని జిల్లాల్లో స్వల్ప స్థాయిలో ఫిర్యాదులు అందినట్లు వివరించారని చెప్పారు. కొన్ని జిల్లాల్లో ఎలాంటి ఫిర్యాదులు, హింసాత్మక ఘటనలు నమోదు కాలేదని స్పష్టం చేశారు.

విజయవాడ 55వ వార్డులో పోలింగ్ గడువు పొడిగింపు : విజయవాడలోని 55 వ వార్డులో సాంకేతిక, ఇతర కారణాలతో సుమారు రెండున్నర గంటల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైన నేపథ్యంలో, ఓటర్లకు తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు పోలింగ్ సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి 7.30 గంటల వరకు పొడిగించినట్లు అనిల్ చంద్ర పునేఠ తెలిపారు.

జిల్లా కలెక్టర్ చేసిన అభ్యర్థనను పరిశీలించి, ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైన కారణంగా ఓటర్లు నష్టపోకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ వెసులుబాటు కల్పించినట్లు వివరించారు.

ఫిర్యాదులపై నివేదికల ఆధారంగా చర్యలు : పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని ఘటనలు జరిగినట్లు జిల్లా కలెక్టర్లు తమ దృష్టికి తీసుకొచ్చారని కమిషనర్ తెలిపారు. పోలింగ్ పూర్తయిన అనంతరం అందే ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీవో) నివేదికలు, ఇతర ఆధారాలను పరిశీలించి, ఫిర్యాదుల్లో వాస్తవాలు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

విజయవాడలోని 55వ వార్డులో పోలింగ్ సమయాన్ని పొడిగించిన అంశం మినహా, మిగిలిన ప్రాంతాల నుంచి పెద్దగా సమస్యలు నివేదించబడలేదని తెలిపారు.

3 గంటల వరకు 48.03 శాతం పోలింగ్ నమోదు : మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లాల నుంచి అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం 48.03 శాతం పోలింగ్ నమోదైనట్లు కమిషనర్ వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన అనంతరం పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రితో రిసెప్షన్ కేంద్రాలకు చేరుకుంటారని తెలిపారు.

పోలింగ్ స్టేషన్ వారీగా నమోదైన ఓట్ల వివరాలను పరిశీలించి, మొత్తం ఓటింగ్ శాతాన్ని లెక్కిస్తారని చెప్పారు. ప్రస్తుతం అందిన సమాచారం ప్రాథమిక అంచనా మాత్రమేనని, రిసెప్షన్ కేంద్రాల నుంచి పూర్తి వివరాలు అందిన అనంతరం సోమవారం నాటికి కచ్చితమైన పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఐజీ రాజకుమారి మాట్లాడుతూ ఆదివారం జరిగిన పోలింగ్ సందర్భంగా సుమారు 40 ఘటనలు నమోదైనట్లు, 275 ఎఫ్ఐఆర్ లు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, నేరపూరిత అంశాలు ఉన్నట్లు గుర్తించిన కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఫిర్యాదులను స్వీకరించి, వాటిపై విచారణ చేపట్టామని, తదుపరి దర్యాప్తులో నిందితులను గుర్తించి అరెస్టులు కూడా చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న ప్రతి ఘటనను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హెలికాప్టర్‌కు పర్మిషన్ ఇచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

జగన్ వచ్చేందుకు తాము హెలికాప్టర్‌కు కూడా పర్మిషన్ ఇచ్చామని అన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు జగన్ పులివెందుకు వస్తారని చెప్పారని, కానీ ఉదయం వస్తారని తెలిసిన తర్వాత కూడా పర్మిషన్ ఇచ్చామని అన్నారు. ఏజెంట్లు ఉదయం 6గంటలకే పోలింగ్ స్టేషన్ లో రిపోర్ట్ చేయాలని చెప్పారు. రిపోర్ట్ చేస్తే వారికి ఐడీ కార్డు ఇస్తారని, కానీ 80 పోలింగ్ బూత్‌లలో 47 మంది పోలింగ్ ఏజెంట్స్ రిపోర్ట్ చేశారన్నారు. మిగితా వాళ్లు రిపోర్ట్ చేయకపోవడం వల్లనే అనుమతించలేదన్నారు. రిపోర్ట్ చేసిన వారిలో కొందరు 11 గంటల వరకు బూత్ లో ఉండి వెళ్లిపోయారన్నారు.

తరవాత నిరసనకు దిగారని, కానీ తాము బయటకు పంపలేదన్నారు. పులివెందులలోని అన్ని పోలింగ్ బూత్ లలో సీసీ కెమెరాలతో నిఘా పెట్టామన్నారు. అందులో ఎలాంటి దౌర్జన్యకరమైన సంఘటనలు జరిగినట్టు లేదన్నారు. రిటర్నింగ్ అధికారుల నుండి కూడా తామకు ఫిర్యాదులు అందలేదన్నారు. పులివెందులలో అయినా, జిల్లాలో అయినా బూత్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు



చేసుకోలేదని, ఓటింగ్ లో కూడా ఎలాంటి తప్పులు జరగలేదన్నారు. పోలింగ్ ప్రశాంతంగానే జరుగుతుందని చెప్పారు. ప్రజలు ఆందోళన చెందవద్దని నిర్భయంగా వెళ్లి ఓటు వేయాలని సూచించారు.

మరో 24 కరువు మండలాలు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 388 కరువు మండలాలను ప్రకటించిన ప్రభుత్వం.. తాజాగా 8 జిల్లాల్లో మరో 24 కరువు మండలాలను ప్రకటించింది. వీటిలో 12 తీవ్ర కరువు, 12 మధ్యస్థ కరువు మండలాలుగా నిర్ణయించింది. రెవెన్యూ-విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ శనివారం ఈమేరకు నోటిఫికేషన్ జారీచేశారు. మార్కాపురం జిల్లా రాచర్ల, కర్నూలు జిల్లా ఆస్పరి, నందవరం, ఆదోని-2, కోసిగి, మంత్రాలయం, కల్లూరు, అనంతపురం జిల్లా రాయగడ్, పెద్దపప్పూరు, శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల, ఆగలి, పెనుగొండలను తీవ్ర కరువు మండలాలుగా, కాకినాడ జిల్లా జగ్గంపేట, కృష్ణా జిల్లా మచిలీపట్నం సౌత్, ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల, పెదపాడు, చాట్రాయి, నూజివీడు, ముసునూరు, ఏలూరు రూరల్, ఆగిరిపల్లి, కడప జిల్లా ఒంటిమిట్ట, సిద్దవటం, నందలూరులను మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించారు.

కాగా అక్టోబరు 1న 21 జిల్లాల్లో 388 కరువు మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా ప్రకటించిన 24తో కలిపి మొత్తం కరువు మండలాల సంఖ్య 412కు చేరింది. వీటిలో 295 తీవ్ర కరువు మండలాలు, 117 మధ్యస్థ కరువు మండలాలు ఉన్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షపాతం లోటు, పంటల సాగు విస్తీర్ణం తగ్గుదల ఆధారంగా కరువు మండలాలను ప్రభుత్వం గుర్తించింది. ఈ మండలాల రైతులు రుణ సౌకర్యం పొందటానికి, సహాయక చర్యలకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

తెలుగు పోలీసులకు దక్షత పతకాలు



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ, ధైర్యసాహసాలు ప్రదర్శించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు పోలీసు అధికారులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్ఠాత్మక కేంద్ర గృహ మంత్రి దక్షత పతకాలకు ఎంపికయ్యారు. శనివారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా 2026 సంవత్సరానికి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర పోలీసు సంస్థలకు చెందిన 490 మంది సిబ్బందికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కేంద్ర గృహ మంత్రి దక్షత పతకాలను ప్రకటించింది.

నేర దర్యాప్తు విభాగంలో ఏపీ నుంచి ఇన్‌స్పెక్టర్లు ఎస్‌కే నఫీజ్ బాషా, జస్వంత్ జయ నాయక్, కొరివి వెంకటరమణ, ఎస్సై యెలుకూరి నాగమధును ఎంపిక చేసింది. వివిధ రాష్ట్రాల్లో ఐపీఎస్‌లుగా విధులు నిర్వహిస్తున్న తెలుగు అధికారులు ఎంసీవీ మహేశ్వర్‌రెడ్డి, వి.శివప్రసాద్ గంజాల, కుమార్ చింతా, సింగారెడ్డి రుషికేశ్‌రెడ్డి, స్పెషల్ ఆపరేషన్ విభాగంలో సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరెడ్డికి పతకాలు లభించాయి.

ఢిల్లీలో పోటాపోటీ నిరసనలు

న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : ఢిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి 'ఓట్ చోరీ మార్చ్' నిర్వహించగా, బీజేపీ 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల సంస్మరణార్థం ర్యాలీ చేపట్టింది.

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నేతలు 'ఛలో ఢిల్లీ' ర్యాలీలో పాల్గొన్నారు. మింటో రోడ్-కన్నాట్ ప్లేస్ ప్రాంతం నుంచి ప్రారంభమైన మార్చ్ రామ్‌లీలా మైదానం వరకు సాగింది. ఓటర్ల జాబితాలో లోపాలను సరిచేయడంతో పాటు సీఈసీ రాజీనామా చేయాలని నేతలు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకే ఈ ఉద్యమం చేపట్టామని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

మరోవైపు 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు సంఘీభావంగా బీజేపీ ర్యాలీ నిర్వహించింది. హరినగర్ బస్‌స్టాప్ నుంచి తిలక్‌నగర్ మెట్రో‌స్టేషన్ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీ నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. రామ్‌లీలా మైదానం పరిసరాల్లో డ్రోన్లు, సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు పారామిలిటరీ సిబ్బందిని మోహరించారు.

రాప్తాడు కేసులో కీలక మలుపు



అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) : రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేసిన కేసులో నిందితుడు హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. ఆదివారం ఆత్మకూరు అటవీ ప్రాంతంలో నిందితుడి కోసం గాలింపు చేపట్టిన పోలీసులకు అతడు తారసపడిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించడంతో కాల్పులు జరిపినట్లు పలు నివేదికలు వెల్లడించాయి.

శనివారం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతులు జరుగుతున్న సమయంలో హేమంత్ ఎలక్ట్రిక్ రంపంతో తరగతి గదిలోకి ప్రవేశించి పదో తరగతి విద్యార్థినిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాలిక తీవ్రంగా గాయపడగా, ఆమెను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినికి కూడా గాయాలయ్యాయి. ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

నిందితుడి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మకూరు అటవీ ప్రాంతంలో అతడు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ కాల్పుల్లో హేమంత్ తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బెంగళూరులో బాలికకు చికిత్స : మరోవైపు, దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందుతోంది. బాలిక పరిస్థితిపై మంత్రి నారా లోకేష్ వైద్యులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. రక్తస్రావాన్ని నియంత్రించిన అనంతరం బాలిక పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స అనంతరం ముఖానికి సంబంధించిన ప్లాస్టిక్ శస్త్రచికిత్స చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

మంత్రి నారా లోకేష్ బెంగళూరులోని ఆసుపత్రికి చేరుకుని బాలికను, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాలికకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

రీపోలింగ్ అయితేనే ఓటేస్తా

(మొదటి పేజీ తరువాయి)

అవకతవకలు జరిగి ఉంటే రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో సంస్కరణలు అవసరమని జగన్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాను ఓటు వేస్తే ఎన్నికల ప్రక్రియ సక్రమంగానే జరిగిందనే సందేశం వెళ్తుందని, అందువల్ల ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రీపోలింగ్ నిర్వహించిన సందర్భంలో తిరిగి వచ్చి ఓటు వేస్తానని స్పష్టం చేశారు.

జగన్ తీరుపై విమర్శలు : జగన్ ఓటు హక్కును వినియోగించుకోకుండా వెనుదిరగడంపై అధికార కూటమి నేతలు విమర్శలు వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసి, నిబంధనల ప్రకారం పరిష్కారం కోరాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. మరోవైపు, వైసీపీ మాత్రం పులివెందులలో జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది.

వందేభారత్ స్లీపర్ వచ్చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

మరుసటి రోజు ఉదయం 11.55 గంటలకు ముంబై చేరుకుంటుంది.


ముంబై-బెంగళూరు (ట్రైన్ నంబర్ 27651): మంగళవారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో రాత్రి 8.10 గంటలకు ముంబైలో బయలుదేరుతుంది. మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

లిఏపీలో రెండు స్టేషన్లలో హాల్ట్ : బెంగళూరు-ముంబై వందే భారత్ స్లీపర్ రైలుకు మొత్తం ఎనిమిది స్టేషన్లలో మాత్రమే హాల్ట్ సౌకర్యం కల్పించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో రెండు, కర్ణాటకలో మూడు, మహారాష్ట్రలో మూడు స్టేషన్లు ఉన్నాయి.

బెంగళూరు నుంచి బయలుదేరిన తర్వాత రైలు ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం, గుంతకల్లు స్టేషన్లలో ఆగుతుంది. అనంతరం కర్ణాటకలో లిలిరాయచూరు, యాద్గిర్, కలబురగిలిలి, మహారాష్ట్రలో లిలిషోలాపూర్, పుణె, కల్యాణ్ స్టేషన్లలో నిలుపుదల ఉంటుంది.

ఏపీ మీదుగా బెంగళూరు-ముంబై మధ్య ప్రయాణించే వారికి ఈ స్లీపర్ రైలు అందుబాటులోకి రావడంతో రాత్రి ప్రయాణానికి మరో వేగవంతమైన రైలు సేవ అందుబాటులోకి వచ్చినట్లవుతుంది.

ఎన్నికలపై నిఘా



(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ ప్రక్రియపై నిఘా కోసం వీడియోగ్రఫీ, డ్రోన్లు, బాడీ వార్న్ కెమెరాలు, సమర్థ యాప్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించినట్లు డీజీపీ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి కడప, కర్నూలు, అనంతపురం సహా రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో మొత్తం 41 ఘటనలు చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలన్నింటినీ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఘటనకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను పూర్తిస్థాయిలో నిర్ధారిస్తామని, ఘటనలకు బాధ్యులైన నిందితులను గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు.

ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను అత్యంత పటిష్టమైన భద్రత మధ్య సురక్షితంగా స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు కొనసాగుతుందని వెల్లడించారు.

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం పట్ల డీజీపీ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు.

తుపాను దెబ్బకు తీవ్రంగా నష్టపోయాం... ఆదుకోండి

కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్) : అర్నబ్ తుపానుతో వరి పంట పూర్తిగా దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని తాళ్లరేవు, కాజులూరు మండలాల రైతులు కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందానికి విన్నవించారు. కాకినాడ జిల్లాలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందం ఆదివారం పర్యటించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని బృందం తాళ్లరేవు మండలం పోలేకుర్రు, బావనపల్లి, కాజులూరు మండలం కొలంక గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించింది. రైతులతో నేరుగా మాట్లాడి సాగు పెట్టుబడులు, పంట నష్టపోయిన విస్తీర్ణం, దిగుబడిపై ప్రభావం తదితర వివరాలను బృందం సేకరించింది. వరి సాగు కోసం ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 35 వేల వరకు పెట్టుబడి పెట్టామని, పంట కోతకు వచ్చే సమయంలో తుపాను కారణంగా పొలాల్లో నీరు చేరి, ఈదురుగాలులకు వరి చేను నేలవాలడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువులకు మేత కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎండోమెంట్ భూములకు సంబంధించి శిస్తు రద్దు చేయాలని కోరారు. తక్షణమే నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పెట్టుబడి రాయితీతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరితగతిన అందించాలని కోరారు. రంగుమారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపజేయాలని, లేదా ప్రీమియం మొత్తాన్ని తగ్గించాలని



కోరారు. ?వ్యవసాయ రంగంతోపాటు విద్యుత్, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు తుపాను కారణంగా జరిగిన నష్టాలను కూడా కేంద్ర బృందం పరిశీలించింది. ఈ బృందంలో వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అదనపు అభివృద్ధి కమిషనర్ ప్రశాంత్ అర్మోరికర్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ హిమాలయ గార్గ్, కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ప్రణయ్ గార్గ్ ఉన్నారు. ఈ పర్యటనలో రాష్ట్రవిపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, వ్యవసాయ, రెవెన్యూ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరిలోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న వ్యవసాయ, ఆక్వా, విద్యుత్, ఉద్యాన పంటలను కేంద్ర బృందం, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించి, బాధితులతో మాట్లాడింది. పంట నష్టాలను శాస్త్రీయంగా అంచనా వేయడంతో పాటు, ఉపగ్రహ చిత్రాలు, రిమోట్ సెన్సింగ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నట్లు బృందం తెలిపింది. కొబ్బరి, అరటి తోటలకు జరిగిన నష్టాలు, ఆక్వా, తీర ప్రాంత గ్రామాలు, నివాస గృహాలు, మత్స్యకార బోట్లు, విద్యుత్ స్తంభాలు, వైర్ల ధ్వంసం వంటి వివరాలను కేంద్ర ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. తొలుత పెనుగొండ మండలం వడలి గ్రామంలో నేలకొరిగిన వరిచేలను, ధ్వంసమైన అరటి పంటలను, పాలకొల్లు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన వైర్లను బృందం సభ్యులు పరిశీలించారు. తుఫాను ప్రభావంపై అక్కడ ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. యలమంచిలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ సామగ్రి, విద్యుత్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఆర్యపేటలో తుపాను తాకిడికి విరిగిపడిన రావి చెట్టును, ధ్వంసమైన భవనాన్ని, పాలకొల్లు-నరసాపురం మార్గంలో రహదారి వెంట కూలిన వృక్షాలను పరిశీలించారు. చించినాడ రోడ్డులో దెబ్బతిన్న రొయ్యల చెరువులను, ఏరియేటర్లు, ఫీడ్ షెడ్లను పరిశీలించి ఆక్వా రైతుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నరసాపురం సెంటర్‌లో ధ్వంసమైన విద్యుత్ టవర్‌ను, లిఖితపూడి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలపై విరిగిపడిన వృక్షాన్ని, జరిగిన నష్టాన్ని పరిశీలించారు. బియ్యపుతిప్పలో ధ్వంసమైన మత్స్యకారుల బోట్లను పరిశీలించి, వారితో మాట్లాడారు. రామన్నపాలెంలో నీటమునిగిన పంట పొలాలు, కొబ్బరి చెట్లు పరిశీలించి రైతులను పంట నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొగల్తూరు మండలం కెపి పాలెం నార్త్, మెట్రేవ్ గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి, బాధితులతో మాట్లాడారు. ఈ బృందంలో రేఖారాణి కొల్లు, డాక్టర్ ఎస్.వి.ఎన్.పి శర్మ, అలోక్ జవహర్, ఎస్.కె రాకేష్ కుమార్ సింగ్ తదితరులతో పాటు ఎపి సిఆర్‌డిఏ అడిషనల్ కమిషనర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఉన్నారు.

డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్ మృతి వైద్య రంగానికి తీరని లోటు

- **పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్**

తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) : ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్ మృతి వైద్య రంగానికి, ముఖ్యంగా తెనాలి ప్రాంతానికి తీరని లోటని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. డాక్టర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆలపాటి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ నేత్ర వైద్య రంగంలో డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్ విశేష సేవలు అందించి ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఎంతోమంది రోగులకు వైద్య సేవలు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. వైద్య వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా సేవా మార్గంగా భావించి, రోగులకు అంకితభావంతో సేవలు అందించడం ఆయన ప్రత్యేకతగా నిలిచిందన్నారు.

వైద్యునిగా వృత్తి నైపుణ్యంతో పాటు సేవాభావంతో సమాజంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని ఆలపాటి పేర్కొన్నారు. నేత్ర వైద్య రంగానికి ఆయన అందించిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. మంచి వైద్య నిపుణుడిని, సేవాభావం కలిగిన వ్యక్తిని కోల్పోవడం



తెనాలి ప్రాంతానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

ఈ కష్ట సమయంలో డాక్టర్ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆలపాటి తెలిపారు. డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్ ఆశయాలు, వైద్య సేవలు ఎప్పటికీ స్మరణీయంగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యులు, ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

నిర్మలా ఫార్మసీ కళాశాలలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్): నిర్మలా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్, ఫార్మాస్యూటిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో "ఆరోగ్యవంతమైన సమాజం-ఆరోగ్యకరమైన భవిష్యత్తు" నినాదంతో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి వైద్య, కంటి, మధుమేహ, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కోనాక్ డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఫాస్టింగ్, పీపీబీఎస్, రాండమ్ బ్లడ్ షుగర్, రక్తపోటు, బరువు, బీఎంఐ పరీక్షలు నిర్వహించగా, మాక్సివిజన్ ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు అందించారు. ముందస్తు ఆరోగ్య పరీక్షలు, వ్యాధుల గుర్తింపు, సరైన వైద్య సలహాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రెవ. సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు, ఫార్మాస్యూటిక్స్ విభాగాధిపతి డాక్టర్ హరే కృష్ణ రాయ్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వింత చేష్టలతో వ్యవస్థలను గౌరవించని జగన్

- **బెంగళూరులోనే ఓటర్ ఐడీ తెచ్చుకుంటే మంచిది: ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

గుంటూరు, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతుంటే ఓర్చుకోలేక వైకాపా అధినేత జగన్‌మోహన్ రెడ్డి వింత చేష్టలకు పాల్పడుతున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు.

పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడాన్ని జగన్ తట్టుకోలేక రీపోలింగ్ పేరుతో డ్రామాలు చేస్తున్నారని గళ్ళా మాధవి ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియను వివాదాస్పదం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పోలింగ్ సందర్భంగా మీడియా ప్రతినిధులపై జరిగిన



దాడులను ఆమె ఖండించారు. కాగా, పులివెందులలో మీడియా సిబ్బందిపై దాడులు, రాజకీయ వర్గాల మధ్య ఘర్షణలపై పలు వార్తా సంస్థలు నివేదించాయి.

స్థానిక సంస్థల్లో బీసీలు, మహిళలకు దాదాపు 39-40 శాతం వరకు ప్రాతినిధ్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను, ప్రజాతీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రశాంత వాతావరణం కొనసాగించాలని కోరారు.

అనారోగ్యంతో ఉన్నప్పటికీ అంబులెన్స్‌లో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నవారు ఉన్నారని, అయితే మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగన్ రీపోలింగ్ జరిగితేనే ఓటు వేస్తానని చెప్పడం సరికాదని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై విశ్వాసం లేకపోతే బెంగళూరులోనే ఓటర్ ఐడీ తెచ్చుకుని అక్కడే ఉండాలని వ్యాఖ్యానించారు.

స్పర్శ్ విధానంలో బిల్లుల అప్లోడింగ్ గందరగోళం

- **పాత విధానాన్నే కొనసాగించాలి.. గడువు నవంబర్ పదిహేనో తేదీ వరకు పొడిగించాలి: ఏపీటీఎఫ్**

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : పాఠశాలల గ్రాంట్ల మంజూరుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త స్పర్శ్ విధానంలో బిల్లుల అప్లోడింగ్ ప్రక్రియ గందరగోళంగా మారిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి తెలిపారు. సమస్యలను పరిష్కరించే వంకు పాత విధానాన్నే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్ఎస్ఏ-స్పర్శ్ విధానంలో వాస్తవంగా చేసిన ఖర్చులకు సంబంధించిన బిల్లులే కాకుండా, చేయని ఖర్చులకు కూడా వెండర్లను సంప్రదించి రశీదులు సమకూర్చాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు పేర్కొన్నారు. వెండర్లు అందుబాటులో లేకపోవడం, అందుబాటులో ఉన్న కొందరు సహకరించకపోవడంతో పాఠశాలల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

కొత్తగా ఉన్నతీకరించిన ఉన్నత పాఠశాలలు, మరికొన్ని పాఠశాలలకు కంటింజెంట్ గ్రాంట్ విభాగం తెరుచుకోకపోవడం, బిల్లులు సమర్పించిన వారికి వేలిముద్ర ధ్రువీకరణ జరగకపోవడం వంటి సాంకేతిక సమస్యలు ఉన్నాయని ఏపీటీఎఫ్ నేతలు వివరించారు. అదేవిధంగా ఎన్నికల విధుల్లో డీడీవోలు ఉండటం, కొన్ని జిల్లాల్లో ఇప్పటివరకు అవగాహన సదస్సులు నిర్వహించకపోవడం వల్ల కూడా బిల్లుల ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు.

ఈ సమస్యలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని అక్టోబర్ ముప్పై ఒకటో తేదీని తుది గడువుగా నిర్ణయించకుండా, బిల్లులు సమర్పించని పాఠశాలలకు, సీఆర్‌సీ గ్రాంట్లకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసేందుకు నవంబర్ పదిహేనో తేదీ వరకు గడువు పొడిగించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు. గ్రాంట్లు సరెండర్ కాకుండా పాఠశాలలకు అవకాశం కల్పించి, స్పర్శ్ విధానంలోని సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఓటమి భయంతోనే జగన్ గగ్గోలు..
ప్రజాస్వామ్యంపై నిందలు

- **వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజం**



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పులివెందులలోనూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పష్టం చేసినప్పటికీ, ఎన్డీఏ కూటమికి ప్రజలు పట్టం కడతారనే భయంతో వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాలంటూ ఆరోపణలు చేస్తూ రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఏజెంట్లను అనుమతించలేదంటూ ఆందోళన చేయడం, రీపోలింగ్ కోరడం ఆయన ఓటమి భయానికి నిదర్శనమన్నారు. ప్రజల తీర్పును గౌరవించకుండా ప్రజాస్వామ్య వ్యవస్థలపై బురదజల్లడం తగదని హితవు పలికారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను అనుమతించలేదన్న జగన్ ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి పేర్కొన్నారు. ప్రజల తీర్పును అంగీకరించలేక రీపోలింగ్ జరపాలంటూ జగన్ డిమాండ్ చేయడం ఆయన రాజకీయ అసహనాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది ప్రజలేనని, వారి తీర్పును గౌరవించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని స్పష్టం చేశారు.

మాక్ పార్లమెంట్‌లోనే ప్రధాని అవ్వండి

చండీగఢ్ (జర్నలిస్ట్ ఫైల్) : లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రధానమంత్రి కావాలన్న కోరిక ఉంటే జీవితాంతం మాక్ పార్లమెంట్‌లోనే ఉండాలని, అక్కడ ప్రధాని కావచ్చని.. దేశానికి మాత్రం ప్రధానమంత్రి అయ్యే అవకాశం రాదని వ్యాఖ్యానించారు.

చండీగఢ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమి నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీపై విమర్శలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇండి కూటమి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ సభకు అధ్యక్షత వహించారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై అమిత్ షా విమర్శలు గుప్పించారు.

జర్నలిస్ట్ ఫైల్ JOURNALIST FILE | సంపాదక స్వరం EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం


55 వేల మరణాల అంచనా..

హెచ్చరికను వినాల్సిందే !

ఎల్‌నినో హెచ్చరిక.. ప్రాణాలను కాపాడే సన్నద్ధత ఎక్కడ?

అసాధారణ వేడి ముప్పు పొంచి ఉంది..

ముందస్తు చర్యలతో ప్రాణనష్టాన్ని నివారించాలి



వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పుడు కేవలం ఉష్ణోగ్రతల పెరుగుదలకే పరిమితం కావడం లేదు. అది నేరుగా మనుషుల ఆరోగ్యం, జీవనోపాధి, వ్యవసాయం, నీటి లభ్యత, ఉత్పాదకతపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో 2026-27లో ఏర్పడుతున్న బలమైన ఎల్‌నినో మరోసారి ప్రపంచ దేశాలకు తీవ్రమైన హెచ్చరికను అందిస్తోంది. ముఖ్యంగా భారత్ వంటి విస్తారమైన జనాభా, భిన్నమైన వాతావరణ పరిస్థితులు, బయట పనిచేసే కోట్లాది మంది కార్మికులు ఉన్న దేశంలో అధిక వేడి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి చర్యలు చేపట్టాల్సిన అవసరం మరింత పెరిగింది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ తాజాగా విడుదల చేసిన ఎల్‌నినో హీట్ మొర్టాలిటీ ట్రాకర్ ప్రకారం, 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా సాధారణ పరిస్థితులతో పోలిస్తే అదనంగా సుమారు 3.73 లక్షల వేడి సంబంధిత మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది. అందులో భారత్‌లో సుమారు 55 వేల అదనపు మరణాలు నమోదయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ మరణాల్లో అధిక భాగం మార్చిలో సంభవించే అవకాశం ఉందని ట్రాకర్ అంచనా వేస్తోంది.

అయితే ఈ సంఖ్యను అర్థం చేసుకోవడంలో అత్యంత జాగ్రత్త అవసరం. ఇది భవిష్యత్తులో తప్పనిసరిగా జరిగే మరణాల సంఖ్య కాదు. వాతావరణ అంచనాలు, ఉష్ణోగ్రతలు--మరణాల మధ్య గతంలో నమోదైన సంబంధాలు, ప్రాంతాల వారీగా వాతావరణ పరిస్థితులు, జనాభా, అనుసరణ సామర్థ్యం వంటి అంశాలను ఆధారంగా చేసుకుని రూపొందించిన లిలిమోడల్ అంచనాలిలి. వాస్తవ మరణాల సంఖ్య వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వాల ముందస్తు చర్యలు, ప్రజల అప్రమత్తత, వైద్య సేవల అందుబాటు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది.

ఇక్కడే ఈ అంచనా అసలు ప్రాధాన్యం సంతరించుకుంటుంది. 55 వేల సంఖ్యను చూసి భయపడటం కాదు.. ఆ స్థాయిలో ప్రమాదం ఉందని ముందుగానే తెలుసుకున్నప్పుడు ఎన్ని ప్రాణాలను కాపాడగలమన్నదే అసలు ప్రశ్నలిలి ఒక విపత్తు సంభవించిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే, ప్రమాదం రాకముందే రక్షణ వ్యవస్థలను సిద్ధం చేయడం ఎంతో సమర్థవంతమైన విధానం.

ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకారం ఎల్‌నినో ఇప్పటికే ఏర్పడి బలపడుతోంది. 2026 అక్టోబర్-డిసెంబర్ కాలంలో పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు మరింత పెరిగి, డిసెంబర్ ప్రాంతంలో ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని జెమీ పేర్కొంది. ఈ ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. అధిక ఉష్ణోగ్రతలతో పాటు వర్షపాతం నమూనాల్లో మార్పులు, కరువు, వరదలు వంటి అనేక వాతావరణ ప్రమాదాలు కూడా పెరిగే అవకాశం ఉందని జెమీ హెచ్చరిస్తోంది.

భారత్‌కు ఇది ప్రత్యేకమైన సవాలు. దేశంలో కోట్లాది మంది వ్యవసాయ కూలీలు, నిర్మాణ కార్మికులు, రోడ్డు కార్మికులు, డెలివరీ సిబ్బంది, చిరు వ్యాపారులు వంటి వర్గాలు ఎండలోనే పనిచేయాల్సి ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలకు తోడు తేమ పెరిగితే శరీరం సహజంగా వేడిని బయటకు పంపడం కష్టమవుతుంది. దీంతో హీట్‌స్ట్రోక్, డీహైడ్రేషన్, గుండె సంబంధిత సమస్యలు, శ్వాసకోశ సమస్యలు వంటి ఆరోగ్య ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంటుంది.

ఇటీవల భారతదేశంలోనే జరిగిన పరిశోధనలు కూడా ముందస్తు అంచనాల ప్రాధాన్యతను సూచిస్తున్నాయి. ఎల్‌నినో-సదరన్ ఆసిలేషన్ వంటి వాతావరణ సంకేతాలను ఉపయోగించి భారత్‌లో తీవ్రమైన తేమతో కూడిన వేడి ప్రభావాన్ని ఆరు నెలల ముందుగానే అంచనా వేయవచ్చని భారత ఉష్ణమండల వాతావరణ శాస్త్ర సంస్థకు చెందిన పరిశోధన సూచిస్తోంది. ఇటువంటి సమాచారం కార్మికుల రక్షణ, పని సమయాల నిర్వహణ, ఆరోగ్య వ్యవస్థల సన్నద్ధతకు ఉపయోగపడుతుంది.

అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి నుంచే లిలిహీట్ యాక్షన్ ప్లాన్‌లనులిలి మరింత పటిష్ఠం చేయాలి. జిల్లాల వారీగా అధిక ప్రమాద ప్రాంతాలను గుర్తించాలి. ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేరేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సదుపాయాలు పెంచాలి. అవసరమైన ప్రాంతాల్లో చల్లదనం కల్పించే కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఆసుపత్రుల్లో హీట్‌స్ట్రోక్, డీహైడ్రేషన్ కేసులను ఎదుర్కొనే ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

బయట పనిచేసే కార్మికుల విషయంలో మరింత స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయాల్లో పని గంటలను తగ్గించడం, విరామ సమయాలను పెంచడం, తాగునీరు అందుబాటులో ఉంచడం, నీడ లేదా విశ్రాంతి ప్రదేశాలు కల్పించడం వంటి చర్యలు తప్పనిసరి చేయాలి. వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు, ఒంటరిగా నివసించే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ప్రజల్లో కూడా అవగాహన పెరగాలి. తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం, అధిక దాహం, గందరగోళం, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలను సాధారణ అలసటగా తీసుకోకూడదు. తీవ్రమైన వేడి సమయంలో తగినంత నీరు తీసుకోవడం, అవసరమైతే వైద్య సహాయం పొందడం, మధ్యాహ్నపు ఎండను వీలైనంత వరకు నివారించడం వంటి సాధారణ జాగ్రత్తలు కూడా ప్రాణాలను కాపాడగలవు.

ఎల్‌నినోను మనం నియంత్రించలేం. పసిఫిక్ సముద్ర ఉష్ణోగ్రతలను మార్చలేం. కానీ లిలిఎల్‌నినో ప్రభావానికి మన సమాజం ఎంతవరకు సిద్ధంగా ఉండాలన్నది మాత్రం మన చేతుల్లోనే ఉంది.లిలి వాతావరణ అంచనాలను ప్రభుత్వాలు కేవలం నివేదికలుగా భద్రపరచకుండా, వాటిని జిల్లా స్థాయి కార్యాచరణగా మార్చాలి.


55 వేల మరణాల అంచనా భయపెట్టే సంఖ్యగా కనిపించవచ్చు. కానీ దాని అసలు సందేశం భయం కాదు--ముందస్తు హెచ్చరిక. ఈ అంచనాలు వాస్తవ మరణాలుగా మారకుండా చేయడానికి ఇప్పుడే చర్యలు ప్రారంభిస్తే, వేలాది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది.

వాతావరణ మార్పుల యుగంలో విపత్తు నిర్వహణ అంటే తుపాను వచ్చిన తర్వాత సహాయం చేయడం మాత్రమే కాదు. వేడి తరంగం రాకముందే నీరు సిద్ధం చేయడం, ఆసుపత్రులను సిద్ధం చేయడం, ప్రజలను అప్రమత్తం చేయడం, కార్మికులను రక్షించడం కూడా విపత్తు నిర్వహణలో భాగమే.

ఎల్‌నినో ప్రకృతి హెచ్చరిక అయితే.. దాన్ని ప్రాణనష్టంగా మార్చకుండా చూడటం ప్రభుత్వాల పరిపాలనా సామర్థ్యానికి పరీక్ష. మరణాలను లెక్కించాల్సిన పరిస్థితి రాకముందే.. ప్రాణాలను కాపాడే చర్యలను లెక్కలోకి తీసుకురావాలి.

రూ.20 అదనపు వసూలు.. రూ.కోటి జరిమానా !

- ధర కంటే దోపిడీ ఎక్కువైతే.. ప్రశ్నించాల్సిందే
- వినియోగదారుడి హక్కు కాగితంపై కాదు.. ఆచరణలోనూ రక్షించాలి



వస్తువు ధర ఎంత అన్నది వ్యాపారికి ఎంత ముఖ్యమో.. వినియోగదారుడికి తాను చెల్లించాల్సిన మొత్తం ఎంత అన్నది అంతే ముఖ్యం. నిర్ణీత ధరకు ఒక రూపాయి అదనంగా వసూలు చేసినా అది కేవలం చిన్న మొత్తానికి సంబంధించిన విషయం కాదు. ధర నిర్ణయ వ్యవస్థను, వినియోగదారుడి హక్కును, వ్యాపారంలో పారదర్శకతను ప్రశ్నించే అంశం. ముఖ్యంగా ఒక ఉత్పత్తిపై ప్రభుత్వం లేదా సంబంధిత సంస్థ నిర్ణయించిన ధర స్పష్టంగా ఉన్నప్పుడు, దాని కంటే ఎక్కువ వసూలు చేయడం సమర్థించదగినది కాదు. తాజాగా తమిళనాడులో వినియోగదారుల వివాదాల పరిష్కార వ్యవస్థలో వెలువడిన రెండు తీర్పులు ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాయి.

వేలూరుకు చెందిన శక్తివేల్ అనే వినియోగదారుడు మూడు బీర్ బాటిళ్లు కొనుగోలు చేసిన సందర్భంలో నిర్ణీత ధర కంటే అదనంగా వసూలు చేశారంటూ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. ఒక్కో బాటిల్ ధర రూ.170గా ఉండగా, మూడు బాటిళ్లకు రూ.510 చెల్లించాల్సి ఉంది. అయితే తన నుంచి రూ.570 వసూలు చేశారని, అంటే మొత్తం రూ.60 అదనంగా తీసుకున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. ఒక్కో బాటిల్‌పై రూ.20 చొప్పున అదనపు వసూలు జరిగినట్లు ఆయన ఆరోపణ. ఇది చూస్తే రూ.60 పెద్ద మొత్తమేమీ కాదని అనిపించవచ్చు. కానీ వినియోగదారుల హక్కుల పరిరక్షణలో అసలు ప్రశ్న మొత్తం ఎంత అన్నది కాదు. లిలినిర్ణీత ధర కంటే ఎక్కువ ఎందుకు వసూలు చేశారు?లిలి అన్నదే కీలకం. ఒక వినియోగదారుడి నుంచి రూ.20 అదనంగా వసూలు చేయడం అనుమతిస్తే, రోజుకు వందలాది మంది వినియోగదారుల నుంచి అదే విధంగా వసూలు చేసే అవకాశం ఉంటుంది. అప్పుడు చిన్న మొత్తాలుగా కనిపించే అక్రమ వసూళ్లు పెద్ద వ్యాపారంగా మారే ప్రమాదం ఉంది. ఈ కేసులో సంబంధిత మద్యం దుకాణాన్ని మూసివేయాలని ఆదేశించడంతో పాటు విక్రేత, జిల్లా మేనేజర్‌పై భారీ జరిమానా విధించినట్లు సమాచారం. ఫిర్యాదు చేసిన వినియోగదారుడికి పరిహారం, న్యాయపరమైన ఖర్చులు చెల్లించాలని కూడా ఆదేశాలు వెలువడ్డాయి. జరిమానా మొత్తాన్ని ప్రజా సంక్షేమ నిధికి మళ్లించాలని ఆదేశించడం ద్వారా అక్రమ వసూళ్లను తేలికగా తీసుకోరాదన్న సందేశాన్ని ఇచ్చినట్లయింది.ఇదే సమయంలో చెంగల్పట్టులో డూప్లికేట్ సిమ్ కోసం వెళ్లిన మహిళ నుంచి నిర్ణీత ఛార్జీ కంటే అదనంగా వసూలు చేసిన మరో ఘటన కూడా వినియోగదారుల హక్కుల ప్రాధాన్యతను గుర్తుచేస్తోంది. డూప్లికేట్ సిమ్ కోసం నిర్ణయించిన ఛార్జీ కంటే రూ.600 అదనంగా వసూలు చేశారంటూ ఫిర్యాదు చేయగా, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించడంతో పాటు వడ్డీ, మానసిక వేదనకు పరిహారం, న్యాయ ఖర్చులు చెల్లించాలని కమిషన్ ఆదేశించినట్లు సమాచారం.

ఈ రెండు ఘటనలూ ఒకే విషయాన్ని చెబుతున్నాయి. లిలివినియోగదారుడు ప్రశ్నించకపోతే అక్రమ వసూళు సాధారణ వ్యవహారంగా మారిపోతాయి.లిలి చాలామంది అదనంగా చెల్లించిన రూ.10, రూ.20, రూ.50 లేదా రూ.100 కోసం ఎక్కడ ఫిర్యాదు చేయాలి, దానికి ఎంత సమయం పడుతుంది, చివరికి ప్రయోజనం ఉంటుందా అనే సందేహాలతో మౌనంగా వెళ్లిపోతారు. ఈ మౌనం అక్రమ వసూలుదారులకు పరోక్షంగా బలాన్నిస్తుంది.

వినియోగదారుల పరిరక్షణ చట్టాల అసలు ఉద్దేశం ఇక్కడే ప్రాధాన్యం సంతరించుకుంటుంది. మార్కెట్‌లో వ్యాపారి, సేవలందించే సంస్థ, వినియోగదారుడి మధ్య శక్తి సమతుల్యత ఎప్పుడూ ఒకేలా ఉండదు. ధర, నిబంధనలు, సేవా ఛార్జీలు వంటి వివరాలపై సంస్థలకు ఎక్కువ సమాచారం ఉంటుంది. సాధారణ వినియోగదారుడు మాత్రం తనకు చెప్పిన మొత్తాన్ని చెల్లించే పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే పారదర్శకత, బిల్లు, ధరల ప్రదర్శన, ఫిర్యాదు వ్యవస్థలు తప్పనిసరి.

ఇక్కడ వ్యాపార రంగానికీ ఒక బాధ్యత ఉంది. లాభం సంపాదించడం తప్పు కాదు. కానీ లాభం కోసం వినియోగదారుడి అవగాహన లోపాన్ని ఉపయోగించుకోవడం మాత్రం సమర్థనీయం కాదు. నిర్ణీత ధర ఉన్న ఉత్పత్తికి అదనపు మొత్తాన్ని వసూలు చేయడం, సేవ పేరుతో అనవసర ఛార్జీలు విధించడం, బిల్లు ఇవ్వకపోవడం వంటి చర్యలు చివరకు వ్యాపార సంస్థలపైనే ప్రతికూల ప్రభావం చూపుతాయి.

అదేవిధంగా సంబంధిత ప్రభుత్వ విభాగాలు కూడా కేవలం ఫిర్యాదు వచ్చిన తర్వాత స్పందించే విధానాన్ని మార్చుకోవాలి. ధరల ప్రదర్శన, బిల్లుల జారీ, అదనపు వసూళ్లపై తనిఖీలు క్రమం తప్పకుండా జరగాలి. ముఖ్యంగా మద్యం దుకాణాలు, మొబైల్ సేవలు, హోటళ్లు, ఆసుపత్రులు, ఆన్‌లైన్ వాణిజ్యం వంటి విభాగాల్లో వినియోగదారుల ఫిర్యాదులకు వేగంగా స్పందించే వ్యవస్థ మరింత బలోపేతం కావాలి.

అయితే వినియోగదారులూ తమ హక్కుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కొనుగోలు చేసిన ప్రతిసారీ బిల్లు లేదా రశీదు తీసుకోవడం, నిర్ణీత ధరను పరిశీలించడం, అదనపు ఛార్జీల వివరాలు అడగడం, అవసరమైతే సంబంధిత అధికారులకు లేదా వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం అలవాటుగా మార్చుకోవాలి. లిలిప్రశ్నించడం గొడవ కాదు.. హక్కును వినియోగించుకోవడం. తమిళనాడులో వెలువడిన ఈ తీర్పులు ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన సందేశం కావు. దేశవ్యాప్తంగా ప్రతి వినియోగదారుడికి వర్తించే ఒక ముఖ్యమైన అవగాహనను ముందుకు తెస్తున్నాయి. చెల్లించే ప్రతి రూపాయికి లెక్క ఉండాలి. ధర నిర్ణయించే సంస్థలు, విక్రేతలు, సేవలందించే సంస్థలు ఆ లెక్కకు జవాబుదారీగా ఉండాలి.

చివరికి వినియోగదారుడి హక్కు రక్షించబడేది చట్టాల పుస్తకాల్లో ఉండటం వల్ల కాదు. ఆ హక్కును వినియోగదారుడు తెలుసుకుని ప్రశ్నించినప్పుడు.. అధికారులు స్పందించినప్పుడు.. న్యాయ వ్యవస్థ రక్షణ కల్పించినప్పుడు మాత్రమే.

అందుకే అదనంగా వసూలు చేసిన రూ.20ను చిన్న విషయంగా చూడకూడదు. అది వినియోగదారుడి జేబు నుంచి వెళ్లిన రూ.20 మాత్రమే కాదు-నిబంధనలకు విలువ ఉందా? వినియోగదారుడి హక్కుకు గౌరవం ఉందా? అన్న ప్రశ్నకు కొలమానం.

కోర్టుల్లో కెమెరాలు.. ప్రభుత్వ బాధ్యతే



- సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో ఇక జాప్యం వద్దు
- నిధుల సాకు వద్దు.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- న్యాయస్థానాల్లో పారదర్శకత, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

న్యాయస్థానాలు న్యాయాన్ని అందించే పవిత్రమైన వేదికలు. అక్కడ జరిగే ప్రతి ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంలో పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో కోర్టుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కోర్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతేనని ధర్మాసనం స్పష్టం చేయడం ద్వారా ఈ విషయంలో బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇచ్చింది.

కోర్టుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఎంత ఖర్చవుతుంది? బడ్జెట్‌లో ఎంత కేటాయించారు? నిధులు ఎప్పుడు విడుదలవుతాయి? వంటి అంశాలు పరిపాలనా ప్రక్రియలో భాగం కావచ్చు. కానీ అవే కారణాలుగా చూపుతూ సుప్రీంకోర్టు ఆదేశాల అమలును నిరవధికంగా వాయిదా వేయడం మాత్రం సమర్థనీయం కాదు. సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో అవసరమైన చర్యలు పూర్తి చేయాలని, ఈ విషయంలో తాము తప్పనిసరిగా ఉత్తర్వులు జారీ చేయాల్సిన పరిస్థితి తీసుకురావద్దని హైకోర్టు చేసిన ఘాటు వ్యాఖ్యలు ప్రభుత్వ యంత్రాంగానికి ఒక స్పష్టమైన సందేశం.

దేశంలోని అన్ని కోర్టులు, ట్రిబ్యునళ్లలో ఆడియోతో కూడిన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు గతంలోనే ఆదేశించింది. ఈ ఆదేశాల వెనుక ఉన్న ఉద్దేశం కేవలం నిఘా ఏర్పాటు చేయడం కాదు. కోర్టు కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచడం, భద్రతను మెరుగుపరచడం, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చేయడం ప్రధాన లక్ష్యం. న్యాయస్థానాలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాల్సిన అవసరం కూడా దీనిలో ఉంది.

అయితే సాంకేతికతను ఉపయోగించేటప్పుడు న్యాయవ్యవస్థ స్వతంత్రత, గోప్యత, డేటా భద్రత వంటి అంశాలను కూడా సమానంగా పరిగణనలోకి తీసుకోవాలి. సీసీ కెమెరాల ఫుటేజ్ ఎవరి ఆధీనంలో ఉంటుంది? ఎంతకాలం భద్రపరుస్తారు? ఎవరు యాక్సెస్ చేయగలరు? దుర్వినియోగం జరగకుండా ఎలాంటి భద్రతా ప్రమాణాలు ఉంటాయి? వంటి ప్రశ్నలకు స్పష్టమైన విధానాలు ఉండాలి. పారదర్శకత పేరుతో న్యాయప్రక్రియకు అవసరమైన గోప్యతకు భంగం కలగకుండా సమతుల్యత పాటించాలి.

కోర్టుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు మరో ముఖ్యమైన ప్రయోజనాన్ని కూడా కలిగించవచ్చు. కేసుల విచారణకు సంబంధించిన ప్రక్రియపై స్పష్టమైన రికార్డు అందుబాటులో ఉండటం వల్ల అనవసర వివాదాలకు అవకాశం తగ్గుతుంది. కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులు, ఇతరులు తమ బాధ్యతలను మరింత క్రమశిక్షణతో నిర్వర్తించే పరిస్థితి ఏర్పడుతుంది. అవసరమైన సందర్భాల్లో ఫుటేజ్ ఆధారంగా వాస్తవాలను పరిశీలించే అవకాశం కూడా ఉంటుంది. అయితే ఈ వ్యవస్థను న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే సాధనంగా కాకుండా, వ్యవస్థను మరింత సమర్థంగా మార్చే సాంకేతిక మద్దతుగా చూడాలి. ప్రస్తుత వివాదంలో ప్రభుత్వం ఇప్పటికే నిధుల విడుదలకు సంబంధించి జీవో జారీ చేసిందని, ఆర్థిక సంవత్సరం ముగియడంతో కొత్తగా నిధుల విడుదలకు చర్యలు అవసరమని ప్రభుత్వం తరపు వాదనలు వినిపించినట్లు తెలుస్తోంది. ఫైలు ఆర్థికశాఖ వద్ద ఉందన్న వివరణ కూడా ఇచ్చారు. ఇవన్నీ పరిపాలనా ప్రక్రియలో భాగమే. కానీ ఆ ప్రక్రియకు అంతం ఎప్పుడు అన్నది మాత్రం స్పష్టంగా ఉండాలి. ఫైళ్లు ఒక శాఖ నుంచి మరో శాఖకు తిరుగుతూ ఉంటే, కోర్టుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు మాత్రం ఎప్పటికీ పెండింగ్‌లో ఉండకూడదు. ప్రభుత్వం తన వద్ద ఉన్న ఆదేశాలు, నిధులు, టెండర్లు, పరికరాల కొనుగోలు, ఏర్పాట్ల పురోగతి వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి. ఏ కోర్టులో ఎప్పుడు ఏర్పాటు చేస్తారు? ఎన్ని కోర్టుల్లో ఇప్పటికే ఏర్పాటు చేశారు? ఎక్కడ పనులు పెండింగ్‌లో ఉన్నాయి? వాటిని పూర్తి చేయడానికి గడువు ఎంత? వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచితే మరింత జవాబుదారీతనం ఉంటుంది.

సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడం ప్రభుత్వానికి ఐచ్ఛికం కాదు. న్యాయస్థానాల ఆదేశాలను గౌరవించడం రాజ్యాంగబద్ధ పరిపాలనకు ప్రాథమిక సూత్రం. ముఖ్యంగా న్యాయవ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాల విషయంలో నిధుల కొరత, పరిపాలనా జాప్యం వంటి కారణాలు నిరంతర ఆలస్యానికి కారణం కాకూడదు.

కోర్టుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఒక సాధారణ మౌలిక సదుపాయం కాదు. అది న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే పారదర్శకతకు సంబంధించిన వ్యవస్థ. అందుకే దీనిని ఫైళ్ల పరిధిలోనే కాకుండా, గడువుతో కూడిన కార్యాచరణగా ప్రభుత్వం తీసుకోవాలి. హైకోర్టు ఆదేశాలు రావడానికి ముందే ప్రభుత్వం తన బాధ్యతను గుర్తించి చర్యలు పూర్తి చేస్తేనే అది మరింత సముచితం. న్యాయస్థానాల నుంచి ఆదేశాలు వచ్చే వరకు వేచి ఉండటం కాదు.. సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవిస్తూ ముందుగానే చర్యలు తీసుకోవడమే బాధ్యతాయుత పరిపాలన.



దేశ ఐక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తి

- జాతీయ సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి





రంగారెడ్డి జిల్లా, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : దేశ ఐక్యత,సమగ్రత,సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు ప్రతి పౌరుడు తన వంతు కృషి చేయాలని సూచించారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకొని శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

500కు పైగా సంస్థానాల విలీనంలో కీలక పాత్ర:

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.దేశాన్ని ఐక్యంగా,బలంగా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నాయకత్వం,దూరదృష్టి, దేశభక్తి చిరస్మరణీయమని అన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో పటేల్ పోషించిన కీలక పాత్రతో పాటు,స్వాతంత్ర్యం అనంతరం దేశ సమైక్యత కోసం చేసిన విశేష కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.ఆయన ఆశయాలు,ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు.

ఐక్యతా ప్రతిజ్ఞ చేసిన అధికారులు

జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ అధికారులు,ఉద్యోగులు,సిబ్బంది జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు.దేశ ఐక్యత,సమగ్రత,భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని,ప్రజల మధ్య సోదరభావం,సామరస్యం,ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ దేశ అభివృద్ధి,జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం



జవహర్‌నగర్, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని జవహర్‌నగర్‌లో మాజీ మేయర్, జవహర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ సేవలను, దేశ అభివృద్ధికి ఆమె చేసిన కృషిని కాంగ్రెస్ నాయకులు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, పల్లె సత్యం, వంశరాజ్, మాజీ కార్పొరేటర్లు శారదా మనోహర్ రెడ్డి, ప్రేమల శ్రీనివాస్, మేధ్చల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాట్ల శ్రీనివాస్, జవహర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మాట్ల వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శులు నాయకం భాస్కర్, గజ్జేల్ శంకర్, డీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, కోశాధికారి పొలాస కిరణ్ కుమార్, వీర్ల భుజంగం, జడల బాలకృష్ణ, కొలిపాక సాయికిరణ్, కన్నబోయిన రాజు యాదవ్, సుబ్రహ్మణ్యం రాజు, వడుపు రామకృష్ణ, విజయరాయి సోమేశ్ చారి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణకార శంఖారావం దాతలకు ఆత్మీయ సత్కారం

- వృత్తి పరిరక్షణ సభకు ఆర్థిక సహకారం అందించిన వారికి సన్మానం
- ఐదేళ్లుగా స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేశా
- తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి



హయత్‌నగర్, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘంఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించిన వృత్తి పరిరక్షణకై స్వర్ణకారశంఖారావం భారీ బహిరంగ సభకు ఆర్థికంగా చేయూతనందించిన దాతలకు శనివారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కర్మన్‌ఘాట్ ఏపీఆర్ గార్డెన్స్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి, ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకట స్వామి, కోశాధికారి గొట్టిముక్కుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సభ విజయవంతానికి విరాళాలు అందించి సహకరించిన దాతలను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలుఅందజేశారు.

స్వర్ణకారుల సమస్యల పరిష్కారం ధ్యేయంగా పనిచేసా

ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకట స్వామి తో కలిసి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న స్వర్ణకారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసానని ఆయన పేర్కొన్నారు.ఐదు సంవత్సరాల పదవీ కాలంలో నిరంతరం రాత్రి, పగలు అనకుండా కృషిచేసానని పేర్కొన్నారు. గతంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం గ్రామీణ ప్రాంతాలలో ఉన్న స్వర్ణకారులను సమస్యలను పట్టించుకోలేదని నేను అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి ప్రత్యక్షంగా, పరోక్షంగా స్వర్ణకారుల వృత్తి పరిరక్షణకై వ్యయ ప్రయాసాలకు ఓర్చి సమస్యల పరిష్కారాలపై కృషి చేశానని ఆయన పేర్కొన్నారు. స్వర్ణకారులు ఎదుర్కొంటున్న ఆర్థికఇబ్బందులు ఉన్నవారిని వృత్తి పరంగా ఇబ్బందులు ఉన్న ముఖ్యంగా పోలీసుల వేధింపులకు సంబంధించిన అంశాల్లో బాధితులకు అండగా నిలిచి అవసరమైన సహాయ సహకారాలు అందించినట్లు పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి మాట్లాడుతూ మా పదవి కాలం పూర్తయింది. ఈ ఐదు సంవత్సరాల కాలంలో చాలా వ్యయ ప్రయాసాలు పడిన, చాలా ఇబ్బందులు వచ్చిన సంఘ పరిరక్షణపై ముందడుగు వేశామని మాకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన మన సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం.

బహిరంగసభకు ఆర్థిక చేయుత అందించిన దాతలకు కృతజ్ఞతలు

స్వర్ణకారుల వృత్తి పరిరక్షణహక్కుల సాధన లక్ష్యంగా నిర్వహించిన శంఖారావం భారీ బహిరంగ సభ విజయవంతం కావడంలో దాతల ఆర్థిక సహకారం కీలకమని సంఘం రాఘవ చారి, వెంకటస్వామి లు పేర్కొన్నారు. స్వర్ణకారుల ఐక్యతను చాటుతూ, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహించిన సభకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్వర్ణకారుల సంక్షేమం,వృత్తి పరిరక్షణ కోసం భవిష్యత్తులోనూ సంఘం తరపుననిరంతరం కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నారోజు సత్య మనోరమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీరామదాసు లక్ష్మణ చారి, రవి ప్రశాంత్ చారి, సహాదారులు గౌరోజు రత్నమాచారి, కేశవాచారి, రాష్ట్ర కార్యదర్శులు రాగిఫణి సతీష్ చారి, వింజమూరి వెంకటాచారి,రాష్ట్ర సహాయ కార్యదర్శులు పొతకమూరి రమేష్ చారి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాగరాజుచారి, బాలేష్ చారి పున్నోజు రామకృష్ణ, పొతకమూరి లక్ష్మణ్, ముదుపొజు శివయ్య, దాసోజు బిక్షమాచారి, జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా సభ్యులు, మండల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు ప్రతీక సర్దార్ పటేల్

- గౌతమ్ నగర్‌లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు



మల్కాజిగిరి, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : దేశ ఐక్యత, సమగ్రత కోసం విశేష కృషి చేసిన భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గౌతమ్ నగర్ డివిజన్ అధ్యక్షుడు ఈసం రాకేష్ ఆధ్వర్యంలో గౌతమ్ నగర్ చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్కే శ్రీనివాస్ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశంలోని సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయుడిగా పటేల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజు, సీనియర్ నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బండారి రవి, బాలసుబ్రహ్మణ్యం, మాజీ అధ్యక్షులు మనోజ్ కుమార్, గౌతమ్, గోపి, కృష్ణమూర్తి, యాదగిరి, సాగర్, గణేష్ యాదవ్, రాజ్ కుమార్, వెంకట్ కిషోర్, లల్లు, దుర్గా, చారి తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం



మణికొండ, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో మణికొండ డివిజన్‌లో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. మణికొండ మర్రిచెట్టు సర్కిల్ సమీపంలోని జలమండలి కార్యాలయం పక్కన ఉన్న కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకుని, ప్రజాస్వామ్యంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బి. రవికాంత్ రెడ్డి, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొండకల నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ జన్నాడ సిద్ధప్ప, రంగా రెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ చిలుకూరి బీరప్ప, పద్మజ, వినోద్, రాజేష్, రఘు, సతీష్ కుమార్, రమేష్ కురుమ, వెంకటాచారి, కురుమూర్తి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

7 హిల్స్ కమ్యూనిటీ బాధితులకు బీఆర్ఎస్ అండ..

- మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణపై సమగ్ర విచారణకు డిమాండ్



మణికొండ, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : 2026 మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు, భవనాలు కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటున్న నార్సింగి పరిధిలోని 7 హిల్స్ కమ్యూనిటీ బాధితులను మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి తో పాటు నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, సుధీర్ రెడ్డి, దాసోజు శ్రవణ్ తదితర భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు కలిసి వారి సమస్యలను, ఆవేదనను శనివారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీలో నిర్వహించిన సమావేశంలో బాధితులు తమ ఇబ్బందులను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. బాధితులకు సంఘీభావంగా బీఆర్ఎస్ మణికొండ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ 2013 మాస్టర్ ప్లాన్‌లో జనావాసాలకు ఇబ్బందులు కలగకుండా ప్రతిపాదించిన 100 అడుగుల రోడ్డు అలైన్‌మెంట్‌ను ప్రస్తుతం ఎందుకు మార్చారని ప్రశ్నించారు. ఈ మార్పులు ఎవరి ప్రయోజనాల కోసం చేశారని నిలదీశారు. రాధా రియాల్టీకి సంబంధించిన వ్యక్తి తక్కువ ధరకు కొనుగోలు చేసిన భూములకు అనుకూలంగా రోడ్డు అలైన్‌మెంట్ మార్చారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ, ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్రపైనా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న సామాన్య ప్రజల ఇళ్లను కూల్చివేసే ప్రయత్నాలను సహించబోమని ఆయన స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా నిలబడి, వారి హక్కులు, ఆస్తుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా, ప్రతి బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హామీ ఇచ్చారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన అడ్వకేట్ గణేష్ గౌడ్

- ఢిల్లీలో మర్యాదపూర్వక భేటీ..లీగల్ సెల్ కార్యక్రమాలపై చర్చ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచన



ఢిల్లీ నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ గణేష్ గౌడ్ శనివారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు.దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన కానం గణేష్ గౌడ్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఇరువురి మధ్య పార్టీ వ్యవహారాలు,లీగల్ సెల్ కార్యకలాపాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ జరిగినట్లు తెలిసింది.టీపీసీసీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు,పార్టీకి సంబంధించిన న్యాయపరమైన అంశాల్లో అందిస్తున్న సహకారం,లీగల్ సెల్‌ను మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న కార్యాచరణను గణేష్ గౌడ్ టీపీసీసీ అధ్యక్షుడికి వివరించారు.అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యక్రమాలు,పట్టభద్రుల ఓటరు నమోదు,అర్హులైన పట్టభద్రులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై కూడా చర్చించినట్లు సమాచారం.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు గణేష్ గౌడ్ తెలిపారు.పార్టీ బలోపేతానికి లీగల్ సెల్ తనవంతు బాధ్యతతో పనిచేస్తూ,ఎన్నికల సందర్భంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తుందని గణేష్ గౌడ్ పేర్కొన్నారు.ఈ భేటీ సందర్భంగా పార్టీ సంస్థాగత అంశాలు,లీగల్ సెల్ భవిష్యత్ కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిపారు.

అన్నాస్ పల్లిలో భూఆక్రమణలపై ఎమ్మార్వోకు వినతి

- భూఆక్రమణల నుంచి పట్టా, ప్రభుత్వ భూములను కాపాడాలి
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్



కడ్తాల్, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల అన్నాస్ పల్లి గ్రామ శివారులోని పట్టా భూములు,ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని కోరుతూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.గ్రామ శివారులోని రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌కు ఆనుకొని ఉన్న పట్టా భూములు,ప్రభుత్వ భూముల్లో అటవీ శాఖ అధికారులు హద్దులు దాటి ఆక్రమణలకు పాల్పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.రిజర్వ్‌డ్ ఫారెస్ట్ చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తమ భూముల హద్దులను నిర్ధారించి,సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు.సంబంధిత భూములను సర్వే చేసి,పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ క్యాతిక మహేష్ యాదవ్,వార్డు సభ్యుడు కంబాల ప్రశాంత్,దేవుల నాయక్,రామావత్ రేణుక శివ,పోతుగంటి రమేష్,పోతుగంటి శేఖర్,కంబాల రామకృష్ణ,నల్లపోతుల శ్రీశైలం,కంబాల శివరామకృష్ణ,పోతుగంటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో పుడమి నాయకుల పాత్ర అభినందనీయం

- యంగ్ ఎర్త్ లీడర్స్‌కు వార్షిక పురస్కారాల ప్రధానం




కడ్తాల్, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : పర్యావరణ పరిరక్షణ,ప్రకృతి వనరుల సంరక్షణ, వాతావరణ మార్పులపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంలో పుడమి నాయకుల పాత్ర అభినందనీయమని రామకృష్ణ మఠానికి చెందిన స్వామి శితికంఠానంద అన్నారు.కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్),తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్నాస్‌పల్లిలోని ది ఎర్త్ సెంటర్‌లో నిర్వహించిన యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం (యెల్ప్) 2025--26 వార్షిక పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు.ప్రకృతి సంరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సీజీఆర్ అధ్యక్షురాలు కొర్పోలు లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.మాజీ సమాచార కమిషనర్ ఆర్.దిలీప్ రెడ్డి,సోషల్ స్టాక్ ఎక్ఛేంజ్ సీనియర్ మేనేజర్ కౌశల్ కిషోర్ కుమార్ లు మాట్లాడుతూ విద్యాబోధనతో పాటు పర్యావరణ వికాసానికి పాఠశాలలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.నాబార్డ్ జనరల్ మేనేజర్ ఆర్.గణపతి పర్యావరణ పరిరక్షణ,సుస్థిర అభివృద్ధి కోసం సీజీఆర్ చేపడుతున్న కార్యక్రమాలకు సహకారం అందిస్తామని తెలిపారు.సీజీఆర్ సీఈఓ జి.నారాయణరావు కార్యక్రమ విస్తరణకు చేపడుతున్న కార్యాచరణను వివరించారు. విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ,సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు వక్తల పేర్కొన్నారు.భవిష్యత్తులో యంగ్ ఎర్త్ లీడర్స్ నెట్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయడంతో పాటు,సుస్థిర పుడమి పత్రికను అన్ని భాషల్లో ప్రచురించనున్నట్లు పర్యావరణ శాస్త్రవేత్త డా.ఎన్.సాయి భాస్కర్ రెడ్డి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకులు కొర్పోలు లక్ష్మారెడ్డి,మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి,విశ్వనాథ్ రెడ్డి,వై.వెంకట్ రెడ్డి,ఎల్.భూషణ్ రెడ్డి,ఉమామహేశ్వర్ రెడ్డి తదితర ప్రముఖులు,సీజీఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమం

- చైల్డ్ అబ్యూస్, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



మల్కాజిగిరి, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : మిర్జాలగూడలోని సెయింట్ డ్యూక్స్ స్కూల్‌లో మల్కాజిగిరి పోలీసుల ఆధ్వర్యంలో చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులు , పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజిగిరి పోలీస్ ఎస్ఐ శ్రీనివాస్ విద్యార్థులకు చిన్నారుల భద్రత, వ్యక్తిగత రక్షణ, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చిన్నారులపై ఎలాంటి వేధింపులు జరిగినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాలను నిరోధించేందుకు రూపొందించిన పోక్సో చట్టంలోని నిబంధనలను వివరించారు. విద్యార్థులు తమ భద్రత పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు, ఏదైనా అనుమానాస్పద సంఘటన ఎదురైతే వెంటనే పెద్దలకు తెలియజేయాలని సూచించారు.

సికింద్రాబాద్ రాణిగంజ్ డిపోలో
అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు



రాంగోపాల్ పేట్, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : సికింద్రాబాద్‌లోని రాణిగంజ్ బస్ డిపోలో అగ్నిమాపక భద్రత,ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఒక ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు.సికింద్రాబాద్ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిపోలోని మెకానిక్‌లు, వర్కింగ్ స్టాఫ్ మరియు అడ్మినిస్ట్రేషన్ సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు.ఈ సదస్సులో అగ్ని ప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి, విపత్కర పరిస్థితులలో వాటిని ఎలా సమర్థవంతంగా ఎదుర్కోవాలి అనే అంశాలను అగ్నిమాపక అధికారులు సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు. వివిధ రకాల మంటలను ఎలా గుర్తించాలో వివరిస్తూ, వాటి క్లాసిఫికేషన్ ఏ,బి, సి, డి గురించి తెలియజేశారు.మంటలు ఏర్పడటానికి కారణమయ్యే గాలి, వేడి, మరియు ఇంధనం అనే మూడు ప్రధాన మూలకాల గురించి స్పష్టంగా వివరించారు.అగ్నిమాపక యంత్రాలను అత్యవసర సమయాల్లో సురక్షితంగా మరియు సులభంగా ఎలా వినియోగించాలో నేర్పించారు.కేవలం సైద్ధాంతికంగా చెప్పడమే కాకుండా, సిబ్బందికి మరింత అవగాహన కోసం మాక్ డ్రిల్ ద్వారా మంటలను ఏ విధంగా ఆర్పాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు.

ఈ అవగాహన సదస్సును సికింద్రాబాద్ అగ్నిమాపక కేంద్ర అధికారి ఎస్. శంకర్, లీడింగ్ ఫైర్ ఫైటర్ ఎం. అశోక్,ఫైర్ ఫైటర్ టెక్నికల్ రాజేందర్ మరియు ఇతర అగ్నిమాపక సిబ్బంది స్వయంగా పాల్గొని డిపో సిబ్బందికి విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా డిపో సిబ్బంది అగ్ని ప్రమాదాలను నివారించడంలో మరియు ఎదుర్కోవడంలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని పొందారని అధికారులు తెలిపారు.

సిరికొండలో రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన సదస్సు

- వరికి బదులు ఆరుతడి, చిరుధాన్యాల సాగు చేపట్టాలి నిజామాబాద్ రూరల్ ఏడీఏ అంజి ప్రసాద్



సిరికొండ, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :
సిరికొండ మండల కేంద్రంలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ (ATMA) సౌజన్యంతో రైతులకు ఆర్‌పీఎల్ (RPL) ఆధారిత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూనెగింజల సాగును ప్రోత్సహించడం, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు మరియు చిరుధాన్యాల సాగును విస్తరించడంపై రైతులకు సమగ్ర అవ గాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజా మాబాద్ రూరల్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ADA) శ్రీ అంజి ప్రసాద్ గారు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. నీటి ఎద్దడిని తట్టుకునే జొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంప్రదాయ పద్ధతుల్లో కాకుండా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంటలను ఎంచుకోవాలని, ఎరువుల వాడకాన్ని తగ్గించి సాగు వ్యయాన్ని తగ్గిం చుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.అనంతరం ఉద్యానవన శాఖ అధికారి రోహిత్ గారు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్య తను, దానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను వివ రించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఆరోగ్యానికి, ఆదాయానికి మేలు చేసే చిరుధాన్యాల (చిరు ధాన్యాలు) సాగును చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్లు దేఘం లక్ష్మి, గోగు సురేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOలు) మరియు గ్రామానికి చెందిన పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం.

- అణగారినవర్గాల ఐక్య గర్జనతోనే సామాజిక న్యాయం.
- మండల సమగ్ర అభివృద్ధికి నాయకులు కృషి చేయాలి.
- హక్కుల సాధనకోసం సంఘటితంగా పోరాడాలి.
- అభివృద్ధిని విస్మరిస్తే ప్రజాగ్రహం తప్పదు.
- మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం తగదు.



జిన్నారం, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :
ప్రజాస్వామ్యంలో ప్రజలఓటు కేవలం నాయకులను గెలిపించడానికే కాదు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధిని సాధించడానికి ఇచ్చే బలమైనతీర్పు.ప్రజలు నమ్మకంతో ఎన్నుకున్న నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరిస్తే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, రాబోయే రోజుల్లో రాజకీయ అస్థిరతకు దారితీసే ప్రమాదం ఉందని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనారిటీ రాష్ట్ర చైర్మన్ తాళ్లపెల్లి రాజేశ్వర్ హెచ్చరించారు.శనివారం జన్నారం మండల కేంద్రంలోని స్థానిక జ్యోతి గార్డెన్స్‌లో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాల భవిష్యత్తు, సామాజిక న్యాయం,మండల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యంగా ప్రసంగించారు.ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి గెలుపొందిన నాయకులు,అనంతరం ప్రజా సమస్యలను పక్కనపెట్టి అభివృద్ధిని విస్మ రిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగకపోవడం బాధాకరమన్నారు.మండలంలో పేదలకు నాణ్యమైన విద్య,వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందడంలేదని,సరైన ఉపాధి అవకాశాలు లేక యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోం దని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు,పారి శుద్ధ్యం వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఆశించిన పురోగతి కనిపించడం లేదన్నారు.ప్రజల కష్టాలను,క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతిని ధులపై ఉందని నాయకులు స్పష్టంచేశారు.ప్రజల విశ్వాసాన్ని నిలబె ట్టుకోవాలంటే మాటలకే పరిమితం కాకుండా చేతల్లో అభివృద్ధిని చూపించాలని సూచించారు. విద్య,వైద్యం, ఉపాధి,మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తూ మండలాన్ని సమగ్ర అభివృద్ధి పథంలో నడిపించేం దుకు నాయకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సమావేశంపాల్గున్న నాయకులు అన్నారు.ప్రజల ఆకాంక్షలను నిర్లక్ష్యం చేస్తే నాయకత్వంపై నమ్మకం క్రమంగా సన్నగిల్లి రాజకీయ పరిణామాలు మారే పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు.సమాజంలో ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాలు రాజకీయంగా, సామాజికంగా,ఆర్థికంగా ఇంకా వెనుకబాటు తనాన్ని ఎదుర్కొంటున్నాయని నాయకులు పేర్కొన్నారు. ఆయా వర్గాల అభ్యున్నతికి సామాజిక ఐక్యత అత్యంత అవసరమని, కులాలు,వర్గాల మధ్య విభేదాలకు తావులేకుండా ఐక్యంగా ముందుకు సాగాలని కార్య క్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు పిలుపునిచ్చారు.తమ హక్కులు,ఆత్మగౌరవం, సమాన అవకాశాల సాధన కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా ఉద్యమించాలని కోరారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్, పట్టణ అధ్యక్షుడు మంద రాజేష్ బీసీ సంఘం నాయకులు కాశెట్టి లక్ష్మణ్,చెట్పల్లి సత్యం,కర్నె నర్సింలు,కోడూరు చంద్రయ్య,అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సిటిమల్ల భరత్ కుమార్,ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ జేఏసీ నాయకుడు మోతే పురుషోత్తం, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ మండల ఇన్‌చార్జి కొండకూరి ప్రభుదాస్,జేఏసీ జిల్లా నాయకుడు మూల భాస్కర్ గౌడ్,సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జాడి గంగాధర్,నేతకాని సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్,ఇందన్‌పల్లి ఉపసర్పంచ్ చుంచు వినయ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బాణావత్ రాములు నాయక్ నాయకులు జునుగురి మల్లయ్య,సీపీఎం నాయకులు కొండ గొర్ల లింగన్న,బుచ్చయ్య, కోడి జుట్టు రాజన్న సంజీవ్,ఆదివాసీ నాయకుడు కాళీతో పాటు వివిధ కుల,సంఘాల దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల అటవీ సేవకు ఘన వీడ్కోలు!

- అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించిన కోట కృష్ణారావుసేవలు చిరస్మరణీయం. అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్.

జిన్నారం, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :
అటవీ సంపద పరిరక్షణే ధ్యేయంగా,విధి నిర్వహణలో నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన జన్నారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కోట కృష్ణారావు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అటవీ సేవలకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. సుమారు 40 ఏళ్లపాటు అటవీశాఖలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఆయనను అటవీశాఖ అధికారులు, సిబ్బంది, సన్నిహితులు ఆత్మీయంగా సన్మానించారు. జన్నారం స్థానిక టీడీసీలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం ఆత్మీయత, అభిమానం, గౌరవాభిమానాల మధ్య ఘనంగా సాగింది.ఈ సందర్భంగా అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ మాట్లాడుతూ. ప్రభుత్వ ఉద్యోగంలో పదవులు,హోదాల కంటే విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, ప్రజలకు అందించిన సేవలు, వృత్తిపట్ల కనబరిచిన అంకితభా వమే చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.కోట కృష్ణారావు నాలుగు దశాబ్దాలపాటు అటవీశాఖలో బాధ్యతాయుతంగా పనిచేస్తూ అటవీ సంపద పరిరక్షణకు తనవంతు కృషి చేశారని కొనియాడారు.విధి నిర్వహణలో ఎదురయ్యే ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ శాఖాపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం అభినందనీయమన్నారు.అటవీశాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందడం ఒక ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమే నని, సమాజంలో సంపాదించుకున్న గౌరవం, సహచరుల అభిమానం, అందించిన సేవల జ్ఞాపకాలు జీవితాంతం వెంట ఉంటాయని



రామ్మోహన్ పేర్కొన్నారు. కృష్ణారావు తన అనుభవాలను యువ ఉద్యో గులకు మార్గదర్శకంగా అందించాలని ఆకాంక్షించారు. ఆయన భవిష్యత్తు జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కోట కృష్ణారావును శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్, అటవీశాఖ అధి కారులు, సిబ్బంది,కోట కృష్ణారావు కుటుంబ సభ్యులు, సన్నిహితులు తదితరులు పాల్గొన్నారు.

అపోలోలో 24 గంటల స్ట్రోక్ కమాండ్ సెంటర్ ప్రారంభం

- స్ట్రోక్ లక్షణాలను గుర్తించిన వెంటనే ఆసుపత్రికి చేరుకోవాలి



హైదరాబాద్, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా అపోలో హాస్పిటల్స్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 24 గంటల పాటు సేవలందించే స్ట్రోక్ కమాండ్ సెంటర్‌ను ప్రారంభించారు. పక్షవాతం (స్ట్రోక్) బాధితులకు సత్వర వైద్య సేవలు అందించడంతో పాటు, చికిత్సలో జాప్యాన్ని తగ్గించడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ జి. రంజిత్ మాట్లాడుతూ.. స్ట్రోక్ వచ్చినప్పుడు ప్రతి నిమిషం ఎంతో కీలక మని, సకాలంలో చికిత్స అందకపోతే మెదడుకు శాశ్వత నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ముఖం ఒకవైపు వాలిపోవడం, ఒక చేయి లేదా కాలు అకస్మాత్తుగా బలహీనపడటం లేదా మొద్దుబారడం, మాట తడబడటం లేదా మాట్లాడలేకపోవడం స్ట్రోక్‌కు ప్రధాన హెచ్చరిక సంకేతా లని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలని సూచించారు.కొ త్తగా ఏర్పాటు చేసిన కమాండ్ సెంటర్ ద్వారా సమీపంలోని ఆసుపత్రులు, వైద్య నిపుణులు, అంబులెన్స్ సేవలను సమన్వయం చేసి బాధితులకు వేగంగా ప్రత్యేక వైద్యం అందిస్తామని తెలిపారు.సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ వేముల శ్రీకాంత్ మాట్లాడుతూ.. స్ట్రోక్ లక్ష ణాలను ముందుగానే గుర్తించడం, వెంటనే వైద్య సహాయం పొందడంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. అకస్మాత్తుగా చూపు మందగించడం లేదా కోల్పోవడం, నడవడంలో ఇబ్బంది, తల తిరగడం, శరీర సమతుల్యత కోల్పోవడం, కారణం తెలియని తీవ్రమైన తలనొప్పి కూడా స్ట్రోక్ హెచ్చరిక సంకేతాలేనని వివరించారు. లక్షణాలు కొద్దిసేపట్లో తగ్గిపోయినా నిర్లక్ష్యం చేయకూడదని, వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు.అపోలో హాస్పిటల్స్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ హర్కరన్ మాట్లాడుతూ.. స్ట్రోక్ బాధితుల సమాచారం ముందుగానే కమాండ్ సెంటర్‌కు చేరడం వల్ల వైద్య బృందం అప్రమత్తమై, రోగి ఆసుపత్రికి చేరుకునేలోపే చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల ఆసుపత్రికి వచ్చిన తర్వాత చికిత్స ప్రారంభించే సమయాన్ని (డోర్ టు నీడిల్ టైమ్) తగ్గించి, అర్హులైన రోగులకు రక్తం గడ్డలను కరిగించే థ్రాంబోలైసిస్ చికిత్సను సత్వరమే అందించవచ్చని తెలిపారు.ఆసుపత్రికి చేరుకునే ముందు నుంచే చికిత్స పూర్తయ్యే వరకు అన్ని విభాగాల మధ్య సమన్వయంతో పనిచేసేలా ఈ కేంద్రం సేవలందిస్తుందని అపోలో ప్రతినిధులు తెలిపారు. స్ట్రోక్ లక్షణాలను గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందడం ద్వారా ప్రాణాలను కాపాడటంతో పాటు మెదడు పనితీరును సంరక్షించవ చ్చని పేర్కొన్నారు.

కేశంపేట నూతన పోలీస్ అధికారులకు యూత్ కాంగ్రెస్ ఘన సన్మానం



కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) : కేశంపేట పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పరమేష్‌లను శనివారం యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిప్పల్ల శ్రీనాథ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన నాయకులు నూతన అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేశంపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు నూతన అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా యువతలో చట్టాలపై అవగాహన కల్పిస్తూ, అసాంఘిక కార్యకలా పాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖకు, ప్రజలకు మధ్య సత్సం బంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనాథ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎండీ అమీర్, శ్రీధర్, మండల ఉపాధ్య క్షుడు రాఘవేందర్, అఖిల్, అజహర్, ఇసాక్, రాజు, కృష్ణ, మహేష్ తదితర యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫోర్చ్యూన్ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు



నేరేడ్‌మెట్, నవంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : మల్కాజిగిరి నియోజకవర్గం 189వ డివిజన్ పరిధిలోని కౌకూర్ ఫోర్చ్యూన్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమ య్యాయి. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంజూరు చేసిన నిధులతో చేపట్టిన ఈ పనులకు స్థానిక నాయకులు, కాలనీ పెద్దలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మణ్ యాదవ్, రాజు యాదవ్, అలీ శ్రీనివాస్, కొండా సురేష్, రూబీ రెడ్డి, సన్నీ, బార్త్, రాజేష్, కాలనీ అధ్యక్షుడు సుధాకర్, సుబ్బారావు, భాస్కర్, వినోద్, ముకేష్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు నాయకులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మురసు తుఫాను నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి: ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుఫాను నేపథ్యంలో గుంటూరు జిల్లాలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. 21 పోలీస్ స్టేషన్ల పరిధిలో భారీ వర్షాల ప్రభావానికి గురయ్యే 73 ప్రాంతాలను గుర్తించి, అక్కడ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని, వాగులు, కల్వర్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, పోలీసు సిబ్బంది అత్యవసర సేవలకు తక్షణమే స్పందించేలా సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

ప్రజలు వాగులు, కల్వర్టులు, నీరు ప్రవహించే ప్రాంతాలకు వెళ్లవద్దని జిల్లా పోలీసులు సూచించారు. అత్యవసర పోలీసు సహాయం కోసం లిగుంటూరు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 86888 31595లి లేదా లి112లికు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని ఎస్పీ తెలిపారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన మఠాధిపతి



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): పోలేరమ్మ గుడికి వచ్చే భక్తులకు స్వచ్ఛమైన నీరు (జలప్రసాదం) అందించడానికి దాతల సహకారం కావాలి అని ఇచ్చిన పిలుపు మేరకు స్పందించి బళ్ళారి వాస్తవ్యులు స్వర్గీయ భీమనేని విశ్వనాథయ్య గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు భీమనేని విశ్వనాథం గారు స్పందించి నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు చేశారు. పోలేరమ్మ గుడిలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ని శాస్త్రోక్తంగా మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వామి వారు ప్రారంభించినట్లు మేనేజర్ పిపిఎన్ ప్రసాద్ తెలిపారు ఈ కార్యక్రమంలో మఠాధిపతి సోదరుడు దత్తాత్రేయ స్వామి మరియు మఠం సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు పాఠశాలలో విద్యార్థినిపై క్రూరదాడి అమానుషం

- బాలికల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి : నల్లపల్లి విజయభాస్కర్

అనంతపురం(జర్నలిస్ట్ ఫైల్): రాప్తాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిపై జరిగిన క్రూరదాడిని ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల భద్రతకు పాఠశాలలు సురక్షిత కేంద్రాలుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు పూర్తి స్థాయి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాలల్లో భద్రతపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.రాప్తాడు ఘటనకు బాధ్యులను గుర్తించి సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు, కుటుంబానికి అవసరమైన సహాయం అందించాలని కోరారు. బాలికల భద్రతే సమాజ భద్రత అని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజయభాస్కర్ అన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీ బాష్యం రామకృష్ణ



గుంటూరు, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): రాజ్యసభ సభ్యుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాష్యం రామకృష్ణ గుంటూరు నగరంలోని లక్ష్మీపురం అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రానికి చేరుకుని తన ఓటు హక్కును వినియోగించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

అన్ని స్థానాల్లో కూటమిదే విజయం : ఎమ్మెల్యే నసీర్

- అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు పట్టం
- ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- పోలింగ్‌కు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు
- ఓటు హక్కు వినియోగించుకున్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): స్థానిక సంస్థల ఎన్నికల పండుగ వాతావరణంలో గుంటూరు తూర్పు శాసనసభ్యులు, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకున్నారు. స్థానిక చౌత్రా సెంటర్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ లో ఆదివారం సామాన్య పౌరుడిలా క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అన్ని స్థానాల్లో ఘన విజయం సాధించబోతున్నారని చెప్పారు. ఓటింగ్ సరళిని చూస్తుంటే అభివృద్ధి, సంక్షేమానికి ఓటర్లు పట్టం కడుతున్నట్లు స్పష్టంగా తెలిసిందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి, నగర మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. కూటమి అందిస్తోన్న పాలన పట్ల ప్రజల్లో పూర్తి సంతృప్తి ఉందన్నారు. గుంటూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు స్థానిక సంస్థల్లో కూటమి గెలుపు అత్యంత కీలకమని చెప్పారు. క్షేత్రస్థాయిలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా శ్రమించి విజయాన్ని సుగమం చేశారని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి సహకరించిన అధికారులు, పోలీసులు, ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండున్నరేళ్ల కాలంలో గుంటూరు నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చేలా చేశాయని అన్నారు.

మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ

- ఘర్షణకు దిగిన రెండు వర్గాలను చెదరగొట్టిన పోలీసులు



గుంటూరు, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. గుంటూరు–అమరావతి రోడ్డులోని నవీన విద్యానికేతనం, రెడ్డిపాలెం హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.

నవీన విద్యానికేతనం పోలింగ్ కేంద్రం వద్ద రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా పోలీసులు వెంటనే స్పందించి ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తిరిగి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ, డ్రోన్ పర్యవేక్షణ, సమర్థ యాప్ ద్వారా పోలింగ్ పరిస్థితులను నిరంతరం సమీక్షించారు.

జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. ఓటర్లు వదంతులను నమ్మకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ పర్యవేక్షణలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, కంట్రోల్ రూమ్ సీఐ బిలాలుద్దీన్, ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

- మైదుకూరు మార్కెట్ కూడలిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఘన నివాళి



మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్):"ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది" అని ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బల్లాని చెన్నకేశవ ప్రసాద్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే సంకల్పంతో పొట్టి శ్రీరాములు గారు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష దేశ చరిత్రలోనే ఒక గొప్ప ఉద్యమంగా నిలిచింది. 1952 అక్టోబర్ 19న నిరాహార దీక్ష ప్రారంభించి, 58 రోజుల పాటు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దీక్ష కొనసాగించి, 1952 డిసెంబర్ 15న అమరులయ్యారు. ఆయన ప్రాణత్యాగం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఆయన చేసిన అపారమైన త్యాగ ఫలితంగానే 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు. ఆయన ఆశయాలు, సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మైదుకూరు పట్టణంలోని మార్కెట్ కూడలిలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సభ, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య జిల్లా సంఘం, ఆపోపా, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొని అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో బల్లాని చెన్నకేశవ ప్రసాద్‌తో పాటు పబ్బతి గోపాల్, దరిశా శ్రీనివాసులు, యెలిశెట్టి గురు ప్రసాద్, పుట్టా సాయి, మాలేపాటి అభిరామ్, తులసి సత్యసాయి, బచ్చు సురేష్, సురే సుబ్బరాజా, కరమలపూటి సుబ్బరాయుడు, చీదేళ్ల సత్యనారాయణ, మల్లేముల పుల్లయ్య, ఇమ్మిడిశెట్టి సతీష్, మలిపేద్దు హరినాథ్, తల్లం రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత కల్పించాలి
- రాప్తాడు పాఠశాలలో బాలిక పైన దాడి ఘటన తీవ్ర దిగ్భ్రాంతికరం

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో విద్యార్థులకు భద్రత కల్పించేలా తగిన భద్రతా సిబ్బంది,సీసీ కెమెరాలను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు.అమరావతిలో సురేష్ బాబు మాట్లాడుతూ రాప్తాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికపై ఉన్మాది చేసిన దారుణమైన దాడిని తీవ్రంగా ఖండించారు.ఈ ఘటన రాష్ట్ర ప్రజల మనసులను తీవ్రంగా కలచివేసిందన్నారు.ఘటనా ప్రాంతంలో దృశ్యాలు తీవ్ర ఆవేదనకు గురి చేశాయన్నారు.నిందితులు ఇలాంటి క్రూరమైన మనస్తత్వంతో పాల్పడుతున్న అమానుష ఘటనల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు.ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ ఇటువంటి వారిని విచారించడమే కాకుండా ఇలాంటి వికృత ఆలోచనలకు మూల కారణాలను అన్వేషించాలన్నారు. సమాజంలో ఇలాంటి విషపు బీజాలు పుడుతూనే వుంటాయని వాటిని ఆదిలోనే గ్రహించి చట్టబద్ధమైన కఠిన శిక్షలతో పాటు,వ్యవస్థలో మార్పు వచ్చేలా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.తీవ్రంగా గాయపడి ప్రాణాలతో పోరాడుతున్న విద్యార్థిని లక్ష్మీ గోపిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉన్మాది చేస్తున్న దాడిని ధైర్యంగా అడ్డుకోబోయి గాయాలు పాలైన విద్యార్థిని లక్ష్మి ధైర్య సాహసాలను సురేష్ బాబు అభినందించారు.

తుఫాను "మురసు" వస్తోంది... అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు
- శిథిలావస్థలో ఉన్న భవనాల వద్దకు ఎవరు వెళ్ళవద్దు
- వాగులు, వంకలు, నదులు దాటువద్దు, చేపలు పట్టుటకు వెళ్ళరాదు

గుంటూరు, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): "మురసు" తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ కార్యాలయం తో సహా మండల స్థాయి కార్యాలయం వరకు కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08632234014 ఫోన్ నంబర్ తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల వద్దకు ఎవరు వెళ్ళవద్దని, అందులో ఎవరు నివసించరాదని విజ్ఞప్తి చేశారు. చెరువులు, వాగులు, వంకల వద్దకు ఎవరు వెళ్ళవద్దని, దాటుటకు ప్రయత్నించవద్దని కోరారు. తడిగా ఉన్న కరెంటు స్తంభాలను ముట్ట వద్దని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ కాన్ఫరెన్స్ ను ఈ మేరకు నిర్వహించారు. వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా, అనంతరం తుఫానుగా మారి, నవంబరు 2 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసిందన్నారు. తీరం దాటే సమయంలో గంటకు 100–110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మూడవ తేదీన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల వివరాలు గుంటూరు నగరపాలక సంస్థ, ఇతర మున్సిపాలిటీలలో సిద్ధం చేసి చేపట్టాల్సిన చర్యలను సమీక్షించాలని ఆదేశించారు. జలవనరుల శాఖ ప్రతీ గంటకు నివేదిక సమర్పించాలన్నారు. ప్రతీ వాగు, కాలువల పర్యవేక్షణకు ఒక్కొక్కరిని నియమించాలన్నారు. పరిస్థితిని అనుసరించి తక్షణం ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పూర్తి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వలు, వివిధ వాగుల ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని జలవనరుల శాఖను ఆదేశించారు. ఎక్కడైతే గట్లు బలహీనంగా ఉన్నాయో వాటిని గుర్తించాలని, అటువంటి చోట్ల ఇసుక బస్తాలు సిద్ధం వేయాలని ఆదేశించారు. గాలులకు హోర్డింగులు, చెట్లు కూలిపోయే పరిస్థితి ఉంటుందని, అర్నాట్ తుఫాన్ లో తొలగించామని, మరోసారి తనిఖీ చేయాలని ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాలు, అండర్ పాస్ ల వద్ద నీరు నిలువ ఉండే అవకాశం ఉందని, ఆ ప్రాంతాల్లో ముందుగానే ఆయిల్ ఇంజిన్ లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పురపాలక సంఘాలు, గ్రామాల్లో సైతం తాగునీటి సమస్య తలెత్త రాదని అన్నారు. తాగునీటి పథకాలు వద్ద జనరేటర్లు సిద్ధంగా పెట్టుకోవాలని ఆదేశించారు. త్రాగునీరు ఎటువంటి పరిస్థితుల్లో కలుషితం కాకుండా స్పష్టమైన పర్యవేక్షణ జరగాలని అన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వలన రవాణాకు ఆటంకం జరక్కుండా ట్రీ కట్టర్స్, పవర్ సాస్ లను సిద్ధంగా పెట్టాలని రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖలను ఆదేశించారు. విపత్తు నిర్వహణ శాఖ అన్ని పరికరాలతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. విద్యుత్తు స్తంభాలు కూలితే వెంటనే పునరుద్ధరణ చేసి విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని బంకుల్లో ఇంధనం పూర్తిస్థాయిలో ఉండే విధంగా పర్యవేక్షణ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. టెలికాం, మొబైల్ సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా సంబంధిత టెలికం కంపెనీలు ముందస్తుగానే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర సరుకులు పూర్తిస్థాయిలో అందుబాటులో పెట్టాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద ఆహార తయారీ కోసం ఏజెన్సీలను సిద్ధం చేసి తక్షణ ఆహార పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుఫాన్ పట్ల రైతులను అప్రమత్తం చేయాలని అవసరమైన సూచనలు సలహాలను అందించాలని వ్యవసాయ ఉద్యానవన శాఖలను ఆదేశించారు. పశువులకు సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు వాటికి తగిన ఆహారము అందే విధంగా పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

అసుపత్రుల వద్ద విద్యుత్ ఆటంకం లేకుండా చూడాలి

ఆసుపత్రుల వద్ద ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు, ఆపరేషన్ థియేటర్ల వద్ద ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. హై రిస్క్‌లో ఉన్న గర్భిణీ స్త్రీలను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. వైద్య సేవలకు ఎటువంటి అంతరాయము ఉండరాదని స్పష్టం చేశారు.

వాగులు, వంకలు, నదులు దాటవద్దు

వాగులు, వంకలు, నదులు ఎవరు దాటువద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుఫాను తీవ్రత ఉండటం, నీటి ప్రవాహాలు పెరగటం జరుగుతుందని చెప్పారు. జల ప్రవాహాలు దగ్గర ఈతకు వెళ్లడం, సాధారణ పనులు చేయుటకు వెళ్లడం ఉండరాదని, దీనిపట్ల గ్రామాల్లో దండోరా వేయించి తెలియజేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ మనుషుల ప్రాణాలు గానీ, పశువుల ప్రాణాలు గానీ, ఆస్తుల నష్టంగాని జరగరాదని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సుపరిపాలన, నగరాభివృద్ధికే ప్రజల ఓటు



- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి జేకేసీ కాలేజీలోని 56వ డివిజన్ 56/4 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు, పోలింగ్ సరళిని పరిశీలించారు.

పశ్చిమ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని గళ్ళా మాధవి తెలిపారు. ప్రజలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని చెప్పారు. నగరంలో సుపరిపాలన, సమగ్ర అభివృద్ధికి ప్రజలు ప్రాధాన్యత ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరిస్తున్న అధికారులు, నాయకులు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గుంటూరు నగర పాలక సంస్థలో 56.15 శాతం పోలింగ్

- 3,47,438 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగం
- బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలింపు

గుంటూరు, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగర పాలక సంస్థ ఎన్నికల పోలింగ్ 56.15 శాతంతో ముగిసింది. మొత్తం 3,47,438 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కె. మయూర్ అశోక్ తెలిపారు.

పోలింగ్ అనంతరం వార్డుల వారీగా వచ్చిన బ్యాలెట్ బాక్సులు, ఇతర ముఖ్యమైన ఎన్నికల సామగ్రిని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి భద్రపరిచారు. ఎన్నికల సామగ్రి స్వీకరణ ప్రక్రియను కమిషనర్ మయూర్ అశోక్ పరిశీలించారు. పోలింగ్ అధికారుల నుంచి నిర్దేశిత పరిశీలన జాబితా ప్రకారం మాత్రమే ఎన్నికల సామగ్రిని స్వీకరించాలని అధికారులకు సూచించారు.

ఎన్నికల సామగ్రిని అప్పగించేందుకు వచ్చిన సుమారు ఆరు వేల మంది సిబ్బందికి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కూడా సిబ్బందితో కలిసి భోజనం చేశారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భోజనం, ఇతర సౌకర్యాల ఏర్పాట్లను జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం ఓట్ల లెక్కింపు కేంద్రాలను కమిషనర్ పరిశీలించారు. నవంబర్ 3న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన భద్రత, మౌలిక వసతులు, ఎన్నికల సామగ్రి తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కె. మయూర్ అశోక్ సూచించారు.

ప్రశాంతంగా ఎన్నికలు



గుంటూరు, నవంబర్ 1(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరపాలక సంస్థలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ ఆదివారం పరిశీలించారు. గుంటూరు పట్టణంలో స్టాల్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని, ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా హెల్ప్ డెస్క్ లు సహకారం అందించాలని ఆదేశించారు. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, అనారోగ్యంతో ఉన్నవారికి తగు ప్రాధాన్యత ఇచ్చి ముందుగా ఓటు వేసే విధంగా సహకరించాలని కోరారు. దివ్యాంగులకు అవసరమైతే త్రిచక్ర వాహనాలుతో సహకారం అందించాలని సూచించారు.

ఓటర్లతో స్వయంగా మాట్లాడి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు పట్ల అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి ఓటింగ్ విధానాన్ని, అనుసరిస్తున్న పరిస్థితులను తెలుసుకున్నారు.

గుంటూరు, తెనాలి పట్టణాల్లో గల ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు ఒక ఆయుధమని దాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుటకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో అమూల్యమైనదని అన్నారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా కొనసాగుతుందని చెప్పారు. ఉదయం 9 గంటల నాటికి జిల్లాలో 5.10 శాతం పోలింగ్ నమోదు కాగా, 11 గంటల నాటికి 18.64 శాతం నమోదు అయినట్లు చెప్పారు గుంటూరులో 17.82 శాతం, తెనాలిలో 21.86 శాతం నమోదు అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా ఎన్నికల అధికారి మరియు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

ఓటు హక్కును వినియోగించుకున్న ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

- ప్రజాస్వామ్యంలో ఓటరే అత్యంత శక్తిమంతుడు
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



విశాఖపట్నం, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తన సతీమణితో కలిసి విశాఖపట్నంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు బాధ్యతగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

ఓటు అనేది కేవలం ఒక గుర్తుపై వేసే ముద్ర కాదని, అది మన ప్రాంత భవిష్యత్తును నిర్ణయించే శక్తిమంతమైన ఆయుధమని పేర్కొన్నారు. ప్రాంత అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సరైన నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు.

ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకమని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా విచక్షణతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే సమర్థవంతమైన పాలన, అభివృద్ధి సాధ్యమవుతాయని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

పులివెందుల పులినని చెప్పుకునే జగన్.. ఓటు వేయకుండా పిరికిపందలా పారిపోయారు : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


- ఓటమి భయంతోనే వైసీపీ అరాచక రాజకీయాలు.. ప్రజల స్వేచ్ఛను అడ్డుకునే ప్రయత్నాలు
- ఇన్నాళ్లూ భయంతో పాలించిన పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా ఓటేస్తుంటే జగన్‌కు వణుకు మొదలైంది
- రాళ్ల దాడులు, విధ్వంసంతో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోలేరు.. జగన్ రాజకీయ నాటకాలకు కాలం చెల్లింది



అమరావతి, నవంబర్ 01(జర్నలిస్ట్ ఫైల్) : పులివెందుల పులినని గొప్పలు చెప్పుకునే గొడ్డలి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఓటు వేయకుండా వెనుదిరగడం ఆయన రాజకీయ పిరికితనానికి నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలపై స్పందించిన మంత్రి.. ప్రజల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేకనే జగన్ ఎన్నికల ప్రక్రియను వివాదాస్పదం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తి కనీసం తన ఓటు హక్కును వినియోగించుకోకుండా రాజకీయ నాటకాలకు తెరలేపడం సిగ్గుచేటన్నారు. ఇన్నాళ్లూ పులివెందులలో భయానక రాజకీయాలతో ఆధిపత్యం కొనసాగించిన వైసీపీకి ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న ఎన్నికలను ఎదుర్కోవడం చేతకావడం లేదని మంత్రి విమర్శించారు. మహిళలు, వృద్ధులు, సామాన్య ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ముందుకు వస్తుంటే వైసీపీ శ్రేణులు రాళ్ల దాడులు, బెదిరింపులతో భయోత్పాతాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజల మద్దతును పొందలేకపోతే హింసాత్మక వాతావరణం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. పోలింగ్ సందర్భంగా వైసీపీ శ్రేణులు రాళ్ల దాడులు, ఘర్షణలు చోటుచేసుకోవడం, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఎన్నికల ప్రక్రియను చిత్రీకరించే మీడియా ప్రతినిధులపైనా దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. ఈ ఘటనల వెనుక ఉన్నవారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ కార్యకర్తలు ఓటర్లను అడ్డుకుంటున్నారనే ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరగాలన్నారు. హింసకు పాల్పడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించరాదని స్పష్టం చేశారు. పులివెందుల అంటే జగన్ కుటుంబానికి రాజకీయ జాగీరు కాదని, అక్కడి ప్రజలు ఎవరి బానిసలూ కాదని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ప్రజలను భయపెట్టి ఓట్లు పొందే రోజులు పోయాయని, ఓటమి భయం పట్టుకున్నప్పుడల్లా విధ్వంసం సృష్టించి ఇతరులపై నిందలు మోపడం వైసీపీ రాజకీయ అలవాటుగా మారిందని విమర్శించారు. ఒకవైపు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తతలు నెలకొంటుంటే మరోవైపు జగన్ రాజకీయ విన్యాసాలు ప్రదర్శించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. ప్రజల ముందుకు వెళ్లి వారి తీర్పును స్వీకరించే ధైర్యం జగన్‌కు లేదని, ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి ఓటు వేయకుండా వెనక్కివెళ్లి ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. పులివెందులలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లింది. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలే తప్ప జగన్ కాదని గుర్తుంచుకోవాలి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

తుఫాన్ ముప్పు నేపథ్యంలో సీఎం ఢిల్లీ పర్యటన రద్దు

- ప్రజల భద్రతకు ప్రాధాన్యం.. అధికారులతో పరిస్థితిపై సమీక్ష



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌కు మరో తుఫాన్ ముప్పు పొంచి ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ముందుగా ఖరారైన తన ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నారు. రాష్ట్రంలో తుఫాన్ ప్రభావం చూపే అవకాశాల నేపథ్యంలో ప్రజల భద్రత, ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంపై దృష్టి సారించారు.

వాస్తవానికి సోమవారం ఢిల్లీలోని భారత మండపంలో నిర్వహించనున్న పలు కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హాజరు కావాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉందన్న సమాచారంతో ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో తుఫాన్ పరిస్థితులు, దాని ప్రభావం చూపే ప్రాంతాలు, వాతావరణ మార్పులపై ముఖ్యమంత్రి అధికారుల నుంచి ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి



- వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు

గుంటూరు, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు పిలుపునిచ్చారు. గుంటూరు నగరంలోని శారదా కాలనీ రోడ్డులో ఉన్న కొల్పింగ్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన వెంట సతీమణి రత్న కుమారి, కుమారుడు డాక్టర్ నక్కా అఖిలేష్ ఉన్నారు.

ఈ సందర్భంగా నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే కీలకమని అన్నారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు, వారి విధానాలు, ప్రజలకు సంబంధించిన అంశాలను నిశితంగా పరిశీలించి ఓటర్లు తమ నిర్ణయాన్ని ఓటు ద్వారా తెలియజేస్తారని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా తమ విచక్షణతో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

యువత భవిష్యత్తుతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఓటు ఒక బలమైన పునాది అని నక్కా ఆనంద బాబు పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అఖండ మెజారిటీతో విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటారనే విశ్వాసం ఉందని తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐటీ ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు

- యువతలో జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించాలి
- ఎన్‌ఆర్‌ఐటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. శరత్



విశదల, మేడికొండూరు, జర్నలిస్ట్ ఫైల్): భారతదేశ ఉక్కు మనిషి, దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలను శనివారం గుంటూరు జిల్లా విశదలలోని ఎన్‌ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్)లో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మేరా యువ భారత్, గుంటూరు, పేస్ సొసైటీల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.

కార్యక్రమానికి ఎన్‌ఆర్‌ఐటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. శరత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డా. దోలా సంజయ్ ఎస్., అడ్మిన్ మేనేజర్ బి. సీతారామయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా డా. దోలా సంజయ్ ఎస్. మాట్లాడుతూ భారతదేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశంలోని సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి అఖండ భారత నిర్మాణానికి పటేల్ చేసిన కృషి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

కె. శరత్, పి. తిలక్ బాబు, బి. సీతారామయ్య మాట్లాడుతూ జాతీయ ఐక్యత దేశ ప్రగతికి పునాది అని పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక సేవాభావాన్ని పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐ డిప్లొమా కళాశాల, జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. రవి కుమార్, ఎన్‌ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. షేక్ లాల్ జాన్ బాషా, కళాశాల లైబ్రేరియన్ డా. షేక్ రసూల్ తదితరులు పాల్గొని జాతీయ ఐక్యత ప్రాముఖ్యతను వివరించారు. దేశ అభివృద్ధి, శాంతి, సామరస్యాల పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా పేస్ సొసైటీ కార్యదర్శి పారుపల్లి రమేష్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం విద్యార్థులు, యువత జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. దేశ సమగ్రత, ఐక్యత, భద్రతను కాపాడేందుకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

పులివెందులలో జగన్‌కు దస్తగిరి నిరసన సెగ



- కాన్వాయ్‌ను అడ్డుకున్న వివేకా కేసు అప్రూవర్
- పోలీసులు అదుపులోకి తీసుకుని పక్కకు తరలింపు

పులివెందుల, నవంబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పులివెందులకు వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అనూహ్య పరిస్థితి ఎదురైంది. పులివెందుల హెలిప్యాడ్ నుంచి నివాసానికి వెళ్తున్న ఆయన కాన్వాయ్‌ను మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి అడ్డుకున్నాడు. హెలిప్యాడ్ నుంచి జగన్ కాన్వాయ్ బయలుదేరిన సమయంలో దస్తగిరి అక్కడికి చేరుకుని నిరసన వ్యక్తం చేశాడు. జగన్ ఎదుటే "సొంత బాబాయ్ వివేకాను చంపించి మా జీవితాలను నాశనం చేశావు.. నీకెందుకు ఓటు వేయాలి జగన్?" అంటూ ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

దస్తగిరి జగన్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వెంటనే అడ్డుకున్నారు. డీఎస్పీ బాలస్వామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అతడి వాహనాన్ని పక్కకు తరలించి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దస్తగిరిని అక్కడి నుంచి పంపించారు.

ఈ ఘటనతో పులివెందుల హెలిప్యాడ్ పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం జగన్ అక్కడి నుంచి తన నివాసానికి వెళ్లిపోయారు.

ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ నేత వల్లూరు జయప్రకాష్



గుంటూరు, నవంబర్ 1(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆదివారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వాజపేయి సర్కిల్‌లోని ఓరియంటల్ ప్రైమరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు.

అదే కేంద్రంలో 43వ డివిజన్ కూటమి బీజేపీ అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలపాటి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హరిపావని, మేళం సైదయ్య, కారం శెట్టి సత్యనారాయణ గుప్తా తదితరులు కూడా పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు.

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జీవనశైలి వారోత్సవాల ప్రారంభం

- ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ హిత జీవన విధానాలను ప్రోత్సహించే లక్ష్యంతో బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. నవంబర్ 7వ తేదీ వరకు జరగనున్న ఈ వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంస్థల్లో యోగా, నడక, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రులు, జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, ఆయుష్ వైద్య కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో యోగా, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించగా, విశాఖపట్నం కేజీహెచ్‌లో వైద్య సిబ్బంది పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. విమ్స్‌లోని వైద్య సిబ్బంది ఆసుపత్రి వార్డుల్లో ప్రతిజ్ఞ చేశారు. క్రిటికల్ కేర్ కేంద్రంలో యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరు, కడప, పాడేరు ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు హనుమాన్‌పేట, కాశిమికోట, రొక్కడిబండసత్రం పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ వివిధ కార్యక్రమాలు చేపట్టారు.

విస్తృత కార్యాచరణ: ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, జిల్లా, మండల స్థాయిల్లో ఈ నెల 7వ తేదీ వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, పరిసరాల పరిశుభ్రత, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. యోగా, నడక, వ్యాయామం, మొక్కల పెంపకం, చిరుధాన్యాలు, సమతుల ఆహారం, నీటి పొదుపు అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాల తగ్గింపు, ఆసుపత్రుల పరిశుభ్రత, డెంగీ, మలేరియా నివారణపైనా ప్రచారం నిర్వహించనున్నారు.

ఆహార భద్రత విభాగం ఆధ్వర్యంలో పాఠశాలలు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార తయారీ సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సురక్షిత ఆహారం తీసుకోవడం, చిరుధాన్యాల వినియోగం పెంచడం, ఆహార వ్యర్థాలను నివారించడం, సురక్షిత నీటిని వినియోగించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగించడం, వ్యర్థాలను తగ్గించడం, పర్యావరణ హిత అలవాట్లను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవడమే సుస్థిర జీవనశైలి ముఖ్య ఉద్దేశమని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు తెలిపారు.

భారత్ అధ్యక్షతన బ్రిక్స్ వారోత్సవాలు

బ్రిక్స్ అనేది బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా తదితర దేశాలతో కూడిన అంతర్జాతీయ సహకార వేదిక. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవన విధానాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు దేశవ్యాప్తంగా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

రాప్తాడు పాఠశాల విద్యార్థినిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- ప్రభుత్వం తక్షణమే స్పందించడం అభినందనీయం: ఆప్టా

అనంతపురం(జర్నలిస్ట్ ఫైల్): రాప్తాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థినిపై జరిగిన అమానుషదాడిని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) తీవ్రంగా ఖండించింది. ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి తక్షణమే స్పందించడం అభినందనీయమని ఆప్టా నాయకులు తెలిపారు. గాయపడిన విద్యార్థిని త్వరగా కోలుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆకాంక్షించారు.

విద్యార్థుల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, పరస్పర గౌరవం, నైతిక బాధ్యతలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆప్టా కోరింది. పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించాలని, పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.

విద్యార్థులకు సురక్షితమైన, ప్రశాంతమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టే చర్యలకు ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందిస్తారని ఆప్టా నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహది, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జి.ఎస్. గణపతి రావు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

రాజ్యాంగ వ్యవస్థలను అవమానించడం కాంగ్రెస్‌కు తగదు

- రాహుల్ గాంధీ తీరుపై బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తాడు బై రామకృష్ణ ఆగ్రహం



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): కేంద్ర ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలను బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తాడు బై రామకృష్ణ తీవ్రంగా తప్పుబట్టారు. ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుని 'పబ్లిక్ ఇంపీచ్‌మెంట్' వంటి పదాలను ఉపయోగించడం రాజ్యాంగ సంస్థలను అవమానించడమేనని విమర్శించారు.

రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో తన వాదనను వినిపించలేక రోడ్లపై రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్లమెంట్‌ను బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదని, ఎన్నికల సంఘం భారత రాజ్యాంగం ద్వారా ఏర్పడిన స్వతంత్ర వ్యవస్థ అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘాన్ని అవమానించడం అంటే రాజ్యాంగ విలువలను అవమానించడమేనని అన్నారు.

ఎన్నికల్లో ఓటమి ఎదురైన ప్రతిసారీ వ్యవస్థలను నిందించడం సరైన రాజకీయ విధానం కాదని రామకృష్ణ పేర్కొన్నారు. గతంలో ఈవీఎంలపై ఆరోపణలు చేసిన కాంగ్రెస్, ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శించారు. భవిష్యత్తులో ఓటర్ల తీర్పును కూడా తప్పుపట్టే పరిస్థితి వస్తుందేమోనని ఎద్దేవా చేశారు. ప్రజల తీర్పును గౌరవించి, ఓటమికి కారణాలను ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

ర్యాలీల పేరుతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించకూడదని ఆయన అన్నారు. భద్రతా ఏర్పాట్లపై కూడా రాజకీయ విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. వ్యాపార వర్గాలు, చాంబర్ ఆఫ్ కామర్స్ వంటి సంస్థలు కూడా ఆందోళనలు, ర్యాలీల విషయంలో తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు.

"రాజ్యాంగ సంస్థలు ఏ ఒక్క కుటుంబానికి, ఏ ఒక్క పార్టీకి చెందినవి కావు. అవి దేశ ప్రజల కోసం పనిచేసే వ్యవస్థలు. కాంగ్రెస్ జమానాలో ఉన్నట్లుగా ప్రతి వ్యవస్థ తమ కుటుంబం చెప్పినట్లు నడవాలని ఆశించడం సరికాదు. ఇది ఆ కాలం కాదు.. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణం దిశగా దేశం ముందుకు సాగుతున్న మోదీ పాలన" అని రామకృష్ణ అన్నారు.

రోడ్లపై రాజకీయాలు.. ఆకాశంలో భారత ప్రగతి: ఒకవైపు రాహుల్ గాంధీ రోడ్లపై రాజకీయ కార్యక్రమాలతో హడావుడి చేస్తుంటే, మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని రామకృష్ణ అన్నారు. ఒకే సమయంలో దేశానికి సంబంధించిన మూడు కీలక పరిణామాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2011 నుంచి 2023 మధ్యకాలంలో భారత్‌లో కోట్లాది మంది పేదరికం నుంచి బయటపడిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే 2027 జనాభా లెక్కలకు సంబంధించిన తేదీల ప్రకటనతో దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియకు రంగం సిద్ధమైందన్నారు.

అంతరిక్ష రంగంలోనూ భారత్ సాధిస్తున్న విజయాలను ఆయన ప్రస్తావించారు. దేశీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్ ద్వారా స్వావలంబన దిశగా భారత్ మరింత ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు.

గతంలో విదేశీ నావిగేషన్ వ్యవస్థలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండగా, ఇప్పుడు స్వదేశీ సాంకేతికతతో అంతరిక్ష రంగంలో భారత్ తన సామర్థ్యాన్ని చాటుకుంటోందన్నారు.

"ఒకవైపు రోడ్డు మీద పార్లమెంట్ పెట్టే రాజకీయాలు.. మరోవైపు ఆకాశంలో ఉపగ్రహాలను ప్రయోగిస్తూ దేశాన్ని సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లే విధానం. ఇదే కాంగ్రెస్‌కు, బీజేపీకి మధ్య ఉన్న తేడా" అని రామకృష్ణ అన్నారు.

'గరీబీ హటావో' నినాదం నుంచి పేదరిక నిర్మూలన దిశగా

కాంగ్రెస్ గతంలో 'గరీబీ హటావో' అనే నినాదాన్ని ఇచ్చిందని, అయితే నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని రామకృష్ణ పేర్కొన్నారు.

"కాంగ్రెస్ గరీబీ హటావో అని నినాదం ఇచ్చింది. బీజేపీ నాయకత్వంలోని మోదీ ప్రభుత్వం పేదరికాన్ని తగ్గించే దిశగా ఫలితాలు సాధిస్తోంది" అని ఆయన అన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ, రాజ్యాంగ సంస్థలపై నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని స్పష్టం చేశారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com